తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
కరీంనగర్ - నిజామాబాద్
రాజన్న సిరిసిల్ల | పెద్దపల్లి | జగిత్యాల | కామారెడ్డి
గురువారం 30 జూలై 2026 | పేజీలు : 8

# రూ.60 లక్షల మరమ్మతులు ఏమయ్యాయి..?

## సిరికొండ మండలానికి రాకపోకలకు బ్రేక్...?




## కొండూరు హై లెవెల్ బ్రిడ్జిపై మళ్లీ అదే సమస్య

## వర్షం వస్తే రాకపోకలకు బ్రేక్.. శాశ్వత పరిష్కారం కోసం ప్రజల ఎదురుచూపులు

**సిరికొండ, జూలై 29 (జనం సాక్షి):** వర్షాకాలం వచ్చిందంటే కొండూరు హై లెవెల్ బ్రిడ్జి సమస్య మరోసారి తెరపైకి వస్తోంది. ప్రజల రాకపోకలకు కీలకమైన ఈ బ్రిడ్జి ప్రతి ఏడాది వర్షాల సమయంలో ఇబ్బందులకు కారణమవుతోంది. తాత్కాలిక మరమ్మతులు చేపట్టినా సమస్య పూర్తిగా పరిష్కారం కాకపోవడంతో మండల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సిరికొండ మండలం నుంచి నిజామాబాద్‌కు వెళ్లే ప్రధాన మార్గాల్లో ఒకటైన కొండూరు హై లెవెల్ బ్రిడ్జి పరిసర గ్రామాల ప్రజలకు ఎంతో కీలకమైనది. రైతులు వ్యవసాయ పనులు, విద్యార్థులు విద్యాసంస్థలు, ఉద్యోగులు, అత్యవసర సేవలు పొందే ప్రజలు ఈ మార్గంపైనే ఆధారపడుతున్నారు.

### భారీ వరదలకు దెబ్బతిన్న బ్రిడ్జి

గత ఏడాది ఆగస్టు 28న కురిసిన భారీ వర్షాలకు ముత్యాల చెరువు తెగిపోయింది. దీంతో వచ్చిన వరద ఉధృతికి కొత్తగా ఏర్పాటు చేసిన కొండూరు హై లెవెల్ బ్రిడ్జిలో ఒక ఖానా దెబ్బతింది. వరద ప్రవాహంతో బ్రిడ్జితో పాటు అనుసంధాన రహదారి కూడా పూర్తిగా దెబ్బతింది. మిగతా 9లో

### కరీంనగర్ నగర ప్రజలకు మరింత మెరుగైన

# ప్రజా రవాణా సేవలు

**నేడు రవాణా శాఖ మంత్రి పొన్నం చేతుల మీదుగా కరీంనగర్ పట్టణంలో సిటీ మెట్రో ఎక్స్ ప్రెస్ బస్సుల ప్రారంభం**




**కరీంనగర్ బ్యూరో, జూలై 29 ( జనంసాక్షి) :** కరీంనగర్ నగర ప్రజలకు మరింత సౌకర్యవంతమైన ప్రజా రవాణా సేవలను అందించాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ఆధ్వర్యంలో నూతనంగా ప్రవేశపెట్టనున్న సిటీ బస్సులను నేడు బుధవారం రోజు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించనున్నారు. పెరుగుతున్న నగర అవసరాలకు అనుగుణంగా ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయడం లక్ష్యంగా విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు తక్కువ ఖర్చుతో సురక్షితంగా ప్రయాణించేందుకు ఈ సిటీ మెట్రో ఎక్స్ ప్రెస్ బస్సులు ఎంతగానో ఉపయోగపడనున్నాయి. కరీంనగర్ – 2 డిపో పరిధిలో ఈ సిటీ బస్సులు మొదటిదశలో 3 బస్సులు ప్రారంభించనున్నారు. క్రింది రూట్లలో నడవనున్నాయి. కరీంనగర్ నుండి వాగేశ్వరి కాలనీ, కరీంనగర్ నుండి చింతకుంట, కరీంనగర్ నుండి కొత్తపల్లి హవేలీ సిటీ మెట్రో ఎక్స్ ప్రెస్ బస్సులను నడుపనున్నది. ఈ సేవలు అందుబాటులోకి ప్రధాన మార్గాల్లో వస్తుండగా, ప్రజల నుంచి వచ్చే స్పందన ఆధారంగా భవిష్యత్తులో మరిన్ని రూట్లకు సిటీ బస్సు సేవలను విస్తరించనున్నారు. నగరంలోని విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార కేంద్రాలు, నివాస ప్రాంతాలను అనుసంధానించే విధంగా ఈ బస్సుల సేవలు అందుబాటులో ఉండనున్నాయి, తద్వారా ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణం కలుగుతుంది.కార్యక్రమంలో ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ప్రజా ప్రతినిధులు, ఆర్టీసీ ఉన్నతాధికారులు పాల్గొననున్నారు.

### భారీ వర్షాలు, మెరుపుల నేపథ్యంలో

## అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్



వార్తా లోపలి పేజీలో

### భగత్‌నగర్ డెకాయిటీ

# కేసు ఛేదన..

- సొంత అల్లుడు, మనుమడే సూత్రధారులు
- మీరట్‌కు చెందిన ముగ్గురు నిందితుల అరెస్ట్
- రూ.2.09 లక్షల నగదు, బంగారం, వెండి ఆభరణాల స్వాధీనం
- ప్రధాన నిందితుల కోసం ప్రత్యేక బృందాల గాలింపు



వార్తా లోపలి పేజీలో

## ప్రజలందరికీ నాణ్యమైన వైద్యాన్ని అందించాలి

### మంత్రి శ్రీధర్ బాబు



**మంథని, జూలై 29, (జనంసాక్షి ) :** తెలంగాణ రాష్ట్ర వైద్య విధాన పరిషత్ ద్వారా మంథని ప్రభుత్వ ఆస్పత్రికి నూతనంగా నియమకమైన గైనకాలజిస్ట్ డాక్టర్ మామిడిపల్లి స్రవంతి, అనస్థీషియా స్పెషలిస్ట్ గుంట మౌనిక లు బుధవారం రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబును పూర్వకంగా కలిశారు. ముందుగా మంథని ప్రభుత్వ ఆసుపత్రి నూతనంగా సూపరిండెంట్ గా పదవి బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ టీవీ రాజశేఖర్ రెడ్డి మంత్రి శ్రీధర్ బాబు కి పూల మొక్క అందజేశారు. సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ముందుగా ఆసుపత్రి సూపరిండెంట్, గైనకాలజిస్ట్,అనస్థీషియా డాక్టర్స్ కి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మంథని ప్రాంతంలో ప్రభుత్వ ఆసుపత్రిలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల సదుపాయాలు కల్పించడం జరిగిందని, ఈ ప్రాంత ప్రజలందరికీ నాణ్యమైన వైద్యాన్ని అందించాలని, మతశిశు వైద్య సేవలను అందరికీ అందించాలని, ఇక్కడ ప్రసూతి సేవలను ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా చూడాలని మంథని చుట్టుప్రక్కల గ్రామాల నుండి వచ్చే ప్రెగ్నెన్సీ కేసులను రిఫర్ చేయకుండా ఇక్కడే అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎక్కువగా సాధారణ ప్రసవాలకు జరిగే విధంగా చూడాలన్నారు. మంథని ప్రభుత్వ ఆసుపత్రిలో ఇటీవల నియామకమైన డెంటల్ స్పెషలిస్ట్ డాక్టర్ పూర్ణిమ గారిచే దంత వైద్య సేవలను ఈ ప్రాంత ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని డాక్టర్స్ కి మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

## అంగన్ వాడీల్లో పోషకాహారంనికి బ్రేక్



**ముస్తాబాద్ జులై 29 (జనంసాక్షి)** మండల కేంద్రంలోని అంగన్వాడి కేంద్రాలకు గత కొన్ని రోజుల నుండి పాల సరఫరా నిలిచిపోయింది. దీనివల్ల వేలాది మంది గర్భిణులు, బాలింతలు పోషకాహారానికి దూరమై ఇబ్బందులు పడుతున్నారు .అయినా ప్రభుత్వం మొద్దు నిద్ర పోయడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకొని ప్రజలు కోరుతున్నారు.

## పేకాట ఆడుతున్న ఏడుగురు అరెస్ట్

**కథలాపూర్, జులై 29(జనం సాక్షి )** కథలాపూర్ మండలంలోని దూలూరు గ్రామంలో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను పట్టుకొని పంచనామా నిర్వహించి వారి వద్ద నుండి 5206/- రూపాయలు మరియు 6 సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కథలాపూర్ ఎస్సై రవి కిరణ్ తెలియజేయడం జరిగింది.

## భూముల రీసర్వేకు ప్రభుత్వం ఆదేశాలు
# తహసీల్దార్ రాచకట్ల సురేష్



**ఇల్లంతకుంట, జూలై 29 (జనంసాక్షి):** రాష్ట్ర ప్రభుత్వం భూముల రీసర్వే నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేసిందని ఇల్లంతకుంట తహసీల్దార్ రాచకట్ల సురేష్ తెలిపారు. మండలంలోని సిరికొండ గ్రామం రీసర్వే కార్యక్రమానికి మొదటగా ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిరికొండ గ్రామంలో గ్రామసభ నిర్వహించి రీసర్వే ప్రక్రియకు సంబంధించిన వివరాలను గ్రామస్తులకు తెలియజేశారు. భూ రికార్డులను కచ్చితంగా రూపొందించడం, భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం కల్పించడం లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపడుతోందని ఆయన వివరించారు. రీసర్వే పనులు పారదర్శకంగా, నిబంధనల ప్రకారం నిర్వహించబడతాయని, గ్రామస్తులు పూర్తి సహకారం అందించాలని తహసీల్దార్ కోరారు. ఈ కార్యక్రమంలో ఏడి, సర్వేయర్, లైసెన్స్ సర్వేయర్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఓడేడ్ యువజన కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు సస్పెండ్

ముత్తారం, జూలై 29 (జనంసాక్షి): ముత్తారం మండలంలోని ఓడేడ్ గ్రామ యువజన కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడు అఖిల్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బక్కతట్ల వినీత్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ విధానాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో మంత్రి శ్రీధర్ బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీను బాబు ఆదేశాల మేరకు ఈ చర్య తీసుకున్నట్లు ఆయన బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, పార్టీ నియమ నిబంధనలను ప్రతి కార్యకర్త తప్పనిసరిగా పాటించాలని ఈ సందర్భంగా బక్కతట్ల వినీత్ సూచించారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలందరూ సమిష్టిగా పనిచేయాలని, క్రమశిక్షణే పార్టీకి బలమని ఆయన పేర్కొన్నారు.

# ఘనంగా గురుపూజోత్సవం నిర్వహించిన బీజేపీ నాయకులు



**వీణవంక, జూలై 29 (జనంసాక్షి):** భారతీయ జనతా పార్టీ వీణవంక మండల శాఖ ఆధ్వర్యంలో గురుపూజోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ వేద పండితులు గూడ జగదీశ్వర్ శర్మను పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ, భారతీయ సంస్కృతి, సనాతన ధర్మ పరిరక్షణలో గురువుల పాత్ర ఎంతో గొప్పదని అన్నారు. సమాజానికి దిశానిర్దేశం చేసే మహోన్నత వ్యక్తి గురువని పేర్కొన్నారు. గురువులను గౌరవించడం భారతీయ సంస్కృతికి ప్రతీక అని, యువత భారతీయ విలువలను ఆచరిస్తూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. మండల బీజేపీ నాయకులు మాట్లాడుతూ, గురుపూజోత్సవాన్ని ప్రతి సంవత్సరం నిర్వహిస్తూ గురువుల సేవలను స్మరించుకోవడం తెలిపారు. గురువుల మార్గదర్శకత్వంతోనే సమాజం పురోగమిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీణవంక మండల అధ్యక్షుడు బత్తిని నరేష్ గౌడ్, మండల సీనియర్ నాయకుడు అయిత రాంబాబు, జిల్లా కార్యదర్శి నరసింహా రాజు, జిల్లా నాయకుడు గుజ్జ సతీష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పుప్పాల రఘు, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, ఓబీసీ రాష్ట్ర కార్యదర్శి రాజు, గౌడుగు వినోద్, దాసరి భాస్కర్, మండల ప్రధాన కార్యదర్శులు ఉడుత కుమార్, శ్రీనివాస్ రెడ్డి, ముత్యాల రవీందర్, టంగుటూరి రాజ్‌కుమార్, పెద్ది మల్లారెడ్డి, నాగరాజు, బీజేవైఎం మండల అధ్యక్షుడు హరికృష్ణ, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సకాలంలో స్పందించి ప్రమాదాన్ని నివారించిన మేడిపల్లి పోలీసులు

**మేడిపల్లి, జూలై 29 (జనంసాక్షి):** భారీ వర్షాలు, ఈదురు గాలుల కారణంగా జాతీయ రహదారి ఎన్‌హెచ్-63పై కూలిన భారీ వృక్షాన్ని వెంటనే తొలగించి ప్రమాదాన్ని నివారించిన మేడిపల్లి పోలీసు సిబ్బంది ప్రజల ప్రశంసలు అందుకున్నారు. మంగళవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షం ప్రభావంతో బుధవారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో మేడిపల్లి మండల కేంద్రంలోని ఎన్‌హెచ్-63 రహదారిపై ఓ భారీ చెట్టు కూలి రాకపోకలకు అడ్డంగా పడింది. అదే సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న మేడిపల్లి పోలీసులు ఘటనను గమనించి వెంటనే స్పందించారు. జేసీబీ యజమానులు జలంధర్, మహేష్ సహకారంతో చెట్టును తొలగించి రహదారిని పూర్తిగా శుభ్రం చేశారు. దీంతో వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. పోలీసుల సకాల స్పందనతో భారీ ప్రమాదం తప్పిందని స్థానికులు అభినందించారు. విధి నిర్వహణలో చురుకుదనం ప్రదర్శించిన పోలీసు సిబ్బంది నాగరాజును మేడిపల్లి ఎస్సై శ్రీధర్ రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రహదారులపై ప్రయాణించే



సమయంలో జాగ్రత్తలు పాటించాలని, ఎక్కడైనా చెట్లు కూలడం, రోడ్లు దెబ్బతినడం లేదా ఇతర అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

# కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం

### 38 కేసుల్లో స్వాధీనం చేసుకున్న 63.621 కిలోల గంజాయి దగ్ధం

**కరీంనగర్ బ్యూరో, జూలై 29 (జనంసాక్షి):** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన 38 కేసులకు సంబంధించి స్వాధీనం చేసుకున్న 63 కిలోల 621 గ్రాముల గంజాయి, ఒక గంజాయి మొక్కను బుధవారం ధ్వంసం చేసినట్లు పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు. మానకొండూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఈదులగట్టెపల్లి గ్రామంలో ఉన్న వెంకటరమణ ఇన్సినేటర్‌లో డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో, పోలీస్ కమిషనర్ సమక్షంలో గంజాయిని దహనం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసులు కట్టుబడి ఉన్నారని, డ్రగ్స్ అక్రమ రవాణా మరియు వినియోగంపై నిరంతరం ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నామని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపీలు శ్రీనివాస్ జి, వెంకటస్వామి, ఇన్‌స్పెక్టర్లు రఫీక్, శ్రీలత, ఆర్ఐలు రజనీకాంత్, శ్రీధర్ రెడ్డి,



అలాగే ఇన్సినేటర్ ప్లాంట్‌కు చెందిన తిరుపతి, ప్రభాకర్ రెడ్డి తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు

### భక్తులతో కిటకిటలాడిన సాయిబాబా ఆలయం

హుజూరాబాద్, జూలై 28 (జనంసాక్షి): అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానాన్ని పంచే గురువులను స్మరించుకునే పవిత్ర పర్వదినం గురుపౌర్ణమిని హుజూరాబాద్ పట్టణ ప్రజలు బుధవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఆషాఢ శుద్ధ పౌర్ణమి సందర్భంగా విద్యాసంస్థల్లో గురుపూజలు, ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భజనలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని శ్రీ గణపతి దత్తాత్రేయ సహిత షిరిడీ సాయిబాబా ఆలయంలో చైర్మన్ వెంపటి సదానందం, అర్చకులు వరుణ్ అయ్యగార్ల ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయాన్ని పూలతో సుందరంగా అలంకరించి ఉదయం నుంచే ప్రత్యేక పూజలు ప్రారంభించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి బాబా దర్శనం చేసుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలశ పూజ, అభిషేకం, హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ, పల్లకీ సేవ తదితర విశేష కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల సాయినామ స్మరణలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో భక్తులకు అన్నదాన కార్యక్రమం



నిర్వహించారు. శ్రీ షిరిడీ సాయిబాబా దివ్య ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, అందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా విశేష పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సేవకులు సత్తిబాబు, భూసారపు సంతోష్, రాజూరి రాజు, ప్రవీణ్, ఇంద్రకరణ్, అకినపల్లి శ్రావణ్, ప్రభాకర్, ప్రసాద్, విజయ, స్వరూపతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్ర చారి

**సిరిసిల్ల, జూలై 29 (జనంసాక్షి):** జిల్లావ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్ర చారి సూచించారు. వర్షాకాలంలో ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ, జిల్లాలో పలు ప్రాంతాల్లో మ్యాన్‌హోల్స్, విద్యుత్ స్తంభాలు, చిన్న కాలువలు, వాగులు ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా నడుచుకోవాలని తెలిపారు. ముఖ్యంగా రోడ్లపై నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో జాగ్రత్తగా



సంచరించాలని సూచించారు. పిల్లలను వరద నీటి ప్రవాహాల వద్దకు, వాగులు, వంకలు, చెరువుల సమీపానికి వెళ్లనివ్వకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు. వర్షాల సమయంలో ప్రమాదకర ప్రాంతాలకు దూరంగా ఉండాలని సూచించారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, రహదారులపై గుంతలు, నీటితో నిండిన ప్రాంతాలు ఉండే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ప్రయాణించాలని తెలిపారు. నాలుగు చక్రాల వాహనాల డ్రైవర్లు కూడా అధిక వేగంతో వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రజల భద్రతే ముఖ్యమని, వర్షాకాలంలో అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని డీఎస్పీ నాగేంద్ర చారి కోరారు.

## జగదాంబ తాండాలో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం



సిరికొండ,జూలై29(జనం సాక్షి):సిరికొండ మండలం జగదాంబ తాండా గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో బుధవారం ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాలావత్ సుగుణ పాల్గొని వైద్య సేవలను పరిశీలించారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరైవైద్య పరీక్షలు చేయించుకున్నారు.ఈ సందర్భంగా ఏఎన్ఎం డి. ఝాన్సీ, అరుణ కుమారి, ఆశా కార్యకర్తలు గ్రామ ప్రజలకు రక్తపోటు, షుగర్ తదితర ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వరా ్షకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల పై అవగాహన కల్పిస్తూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని, స్వచ్ఛమైన తాగునీటిని వినియోగించాలని సూచించారు. జ్వరం, ఇతర అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు.గ్రామంలో ఉచిత వైద్య సేవలు అందుబాటులోకి రావడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ వైద్య సిబ్బందికి, గ్రామ పంచాయతీకి కృతజ్ఞతలు తెలిపారు

## రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డిని కలిసిన కొండూరు గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడు గర్గుల రాములు



సిరికొండ,జూలై29(జనంసాక్షి):కొండూరు గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడు గర్గుల రాములు రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డిని మర్యాదపూర్వకంగాఃకలిశారు.ఈసందర్భగా ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సన్మానించి, గ్రామ అభివృద్ధికి ఆయన అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలియజేశారు.అనంతరం కొండూరు గ్రామానికి సంబంధించిన పలు అభివృద్ధి పనులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు, అవసరమైన నిధులు మంజూరు చేసి గ్రామాభివృద్ధికి నిరంతరం అండగా నిలవాలని ఎమ్మెల్యేను కోరారు.దీనికి స్పందించిన ఎమ్మెల్యే భూపతి రెడ్డి గ్రామాభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని, ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో కొండూరు గ్రామ సర్పంచ్ నర్మాల లత భాస్కర్, చల్ల రాజరెడ్డి, రాం రెడ్డి, లక్ష్మారెడ్డి, భాస్కర్, నాయిడి రాజేందర్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విపత్తుల సమయాలలో సమర్ధవంతంగా సేవలు అందించాలి

- అదనపు కలెక్టర్ భుజంగరావు
- ఆపద మిత్ర వాలంటీర్లకు కిట్లు పంపిణీ



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 29: జనం సాక్షి** విపత్తులు సంభవించిన సమయాల్లో ఆపద మిత్ర వాలంటీర్లు తక్షణమే స్పందిస్తూ సహాయక చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ వి.భుజంగరావు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో బుధవారం ఆపద మిత్ర వాలంటీర్లకు కిట్లు పంపిణీ చేశారు. విపత్తుల సమయాలలో సహాయక చర్యలు చేపట్టేందుకు ఉపకరించే 14 రకాల వస్తువులతో కూడిన ఈ కిట్ ను ఎలా ఉపయోగించాలి అనే విషయాల గురించి ఎస్ డీ ఆర్ ఎఫ్ అధికారులు తెలియజేశారు. విపత్తులు సంభవించిన సమయాల్లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఆస్తి, ప్రాణ నష్టాన్ని ఎలా నివారించాలి, అత్యవసర సమయాలలో ప్రాథమిక చికిత్స పద్ధతులు, సీ.పీ.ఆర్ చేసే విధానం, తదితర అంశాల గురించి వివరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అదనపు కలెక్టర్ భుజంగరావు మాట్లాడుతూ, విపత్తులను నిలువరించే శక్తి ఎవరికీ ఉండదని, అయితే ముందస్తు సన్నద్ధతతో ప్రాణ, ఆస్తి నష్టాల్ని చాలా వరకు నివారించవచ్చని అన్నారు. ఈ దిశగా క్షేత్రస్థాయిలో ఉండే ఆపద మిత్ర వాలంటీర్లు విపత్తుల సమయాలలో సమర్ధవంతంగా సేవలు అందించాలని సూచించారు. ఇప్పటికే వాలంటీర్లకు ప్రకృతి వైపరీత్యాల సమయాలలో ఎలా వ్యవహరించాలి అనే అంశాలపై నిపుణుల ద్వారా శిక్షణ అందించామని గుర్తు చేశారు. నేర్చుకున్న అంశాలను విస్మరించకుండా ఆపద సమయాలలో ప్రజలకు సహాయకారులుగా నిలవాలని ఉద్బోధించారు. అదే సమయంలో స్వీయ రక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని హితవు పలికారు.జిల్లా రెవెన్యూ అధికారి గీత మాట్లాడుతూ, ఆపద సమయాలలో ప్రజలకు సహాయపడే అవకాశం లభించడాన్ని అదృష్టంగా భావించాలని అన్నారు. ఆపద మిత్ర నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్న జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి సాయన్న మాట్లాడుతూ, ఆపద మిత్ర వాలంటీర్లకు ప్రభుత్వం ఉచిత శిక్షణ ఇవ్వడంతో పాటు గుర్తింపు కార్డులు, ఉపకరణాలతో కూడిన కిట్లు అందజేసిందని, బీమా సదుపాయం వర్తింపజేస్తుందని గుర్తు చేశారు. ఈ తోడ్పాటును సద్వినియోగం చేసుకుని సమర్ధవంతంగా సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ డీ-సెక్షన్ పర్యవేక్షకులు శ్రీనివాస్ రావు, ఆర్ఎస్ఐ శ్రీనివాస్, అగ్నిమాపక శాఖ, 7వ పోలీసు బెటాలియన్ అధికారులు, ఆపద మిత్ర వాలంటీర్లు పాల్గొన్నారు.

## అంగన్వాడీ నియామకాలలో మధ్యవర్తులను నమ్మొద్దు

- జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి ఐ. ప్రసన్న



**కామారెడ్డి, జిల్లా ప్రతినిధి జూలై 29 (జనం సాక్షి)**మహిళా శిశు సంక్షేమ శాఖలో అంగన్వాడీ టీచర్, అంగన్వాడీ ఆయా పోస్టుల నియామక ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నామని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి ఐ. ప్రసన్న తెలిపారు. బుధవారం ఎల్లారెడ్డి ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో కొనసాగుతున్న సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించి, వెరిఫికేషన్ ప్రక్రియపై అధికారులకు పలు సూచనలు చేశారు.అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని, నోటిఫికేషన్‌లో పేర్కొన్న అర్హతలు, శాఖ మార్గదర్శకాల ప్రకారం ప్రతి దరఖాస్తు, సర్టిఫికెట్‌ను క్షుణ్ణంగా పరిశీలించాలని సంబంధిత సీడీపీవోకు ఆదేశించారు.ఈ సందర్భంగా ఐ. ప్రసన్న మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నియామక ప్రక్రియను నిష్పాక్షికంగా, పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలోని ఐదు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో మొత్తం 95 అంగన్వాడీ టీచర్ పోస్టులు, 95 అంగన్వాడీ ఆయా పోస్టుల భర్తీకి సర్టిఫికెట్ వెరిఫికేషన్ కొనసాగుతోందని పేర్కొన్నారు. నియామకాల పేరుతో ఎలాంటి మధ్యవర్తులను నమ్మవద్దని, ఎవరైనా డబ్బులు డిమాండ్ చేసినా లేదా తప్పుడు హామీలు ఇచ్చినా వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని అభ్యర్థులకు సూచించారు. ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత సీడీపీవో కార్యాలయాన్ని నేరుగా సంప్రదించాలని, శాఖ సిబ్బంది అవసరమైన సమాచారాన్ని అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారని తెలిపారు.సర్టిఫికెట్ వెరిఫికేషన్ తేదీలు, ఇతర వివరాలను గ్రామాల్లో చాటింపు, వివిధ సమాచార మాధ్యమాల ద్వారా అభ్యర్థులకు విస్తృతంగా తెలియజేస్తున్నట్లు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి వెల్లడించారు.

## గురువు స్థానం దైవంతో సమానం



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 29:( జనం సాక్షి )**ఇందూరు: భారతీయ సాంప్రదాయంలో గురువు స్థానం దైవంతో సమానమని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. గురు పూర్ణిమను పురస్కరించుకొని బుధవారం నగరంలోని బింగి కళ్యాణ మండపంలో గురువు కోన సముందర్ శ్రీనాథ్ శర్మ దంపతులకు కుటుంబసమేతంగా పాద పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...గురువులు జీవితంలోని అజ్ఞానాంధకారాన్ని తొలగించి జ్ఞాన వెలుగును ప్రసాదిస్తారని పేర్కొన్నారు. వేల సంవత్సరాలుగా భారతదేశంలో కొనసాగుతున్న గురు శిష్య సంప్రదాయానికి ఈరోజు ప్రతీకగా నిలుస్తుంది అన్నారు. గురువులకు పాదపూజ చేయడం, తోచిన దక్షిణ, వస్త్రాలు, పండ్లు, పుస్తకాలు, సమర్పించడం ఆనవాయితీ అన్నారు. తల్లిదండ్రులు జన్మనిస్తే, గురువు జీవితానికి అర్థాన్ని నేర్పుతారని అన్నారు. జ్ఞానం, వినయం, సంస్కారం, ధర్మం విలువలను గుర్తు చేసే పవిత్ర పర్వదినం అని వివరించారు. అంతకుముందు మల్లారంలోని దత్త ఆశ్రమాన్ని దర్శించుకున్నారు.

## ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఎస్ఐఆర్ ప్రక్రియ 100 శాతం పూర్తి



అధికారులను అభినందించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధిజూలై 29 (జనం సాక్షి)** ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ సార్ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఎన్యూమరేషన్ ఫారమ్‌ల (జుఖీా) ప్రక్రియను 100 శాతం విజయవంతంగా పూర్తి చేసినందుకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సంబంధిత అధికారులను, సిబ్బందిని అభినందించారు.నియోజకవర్గంలో మొత్తం 2,28,503 మంది ఓటర్లు ఉండగా, వారిలో 2,06,220 మంది (90.25 శాతం) ఓటర్లకు సంబంధించిన ఈఎఫ్ఎస్ ఫారమ్‌ల డిజిటైజేషన్ విజయవంతంగా పూర్తయింది. మిగిలిన 22,283 మంది (9.75 శాతం) ఓటర్లకు సంబంధించిన ఫారమ్‌లు అందుబాటులో లేకపోవడంతో వాటిని అన్‌కలెక్టెడ్ ఫార్మ్సు నమోదు చేయడం ద్వారా మొత్తం ఓటర్ల వివరాల ప్రక్రియను 100 శాతం పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, నిర్దేశిత గడువులో లక్ష్యాన్ని పూర్తిచేయడం ఎన్నికల యంత్రాంగం సమష్టి కృషికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ విజయానికి కృషి చేసిన ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు, తహసీల్దార్లు, బీఎల్‌వోలు, సూపర్వైజర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు మరియు ఇతర సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.ఇదే స్ఫూర్తితో ఎన్నికల ప్రక్రియలో నాణ్యత, పారదర్శకత, సమర్థతను కొనసాగిస్తూ భవిష్యత్‌లో కూడా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. ఎన్నికల ప్రక్రియను పకడ్బందీగా అమలు చేయడంలో అధికారులు ఇదే విధమైన నిబద్ధతతో పనిచేయాలని ఆయన సూచించారు.

## వర్షాకాలంలో రోడ్లు, డ్రైనేజీల మరమ్మతులు చేపట్టాలి

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి జూలై 29 (జనం సాక్షి)**వర్షాకాలం నేపథ్యంలో కామారెడ్డి పట్టణంలోని పలు వార్డుల్లో నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని బీజేపీ కౌన్సిలర్లు ఇంచార్జి



మున్సిపల్ కమిషనర్, డీఈకి వినతిపత్రం సమర్పించారు. అలాగే ఆషాడం బోనాల ఉత్సవాల సందర్భంగా అమ్మవారి ఆలయాల పరిసరాల్లో మొరం వేయించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా బీజేపీ కౌన్సిలర్లు మాట్లాడుతూ, ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా పట్టణంలోని అనేక రహదారులు గుంతలమయంగా మారాయని, ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పలు ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగు నీరు రోడ్లపైకి చేరి దుర్వాసనతో పాటు పారిశుద్ధ్య సమస్యలు కూడా తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా శివారు ప్రాంతాల వార్డుల్లో పరిస్థితి మరింత అధ్వాన్నంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అత్యవసరంగా రోడ్లపై పాచ్‌వర్క్ పనులు చేపట్టి, అవసరమైన ప్రాంతాల్లో మొరం వేయాలని అధికారులను కోరినట్లు తెలిపారు. అదేవిధంగా బోనాల పండుగను దృష్టిలో ఉంచుకుని అమ్మవారి దేవాలయాల పరిసరాల్లో బురద పేరుకుపోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, భక్తులకు అనుకూలమైన వాతావరణం కల్పించాలని మున్సిపల్ అధికారులను విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు చేపట్టాలని బీజేపీ కౌన్సిలర్లు కోరారు.

# శాకంబరీ అలంకరణలో మహాలక్ష్మి దర్శనం



**మంథని, జూలై 29, (జనంసాక్షి ):** మంత్రపురి శ్రీ మహాలక్ష్మీ అమ్మవారు శాకంబరీ అలంకరణలో బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక శ్రీ మహాలక్ష్మి ఆలయంలో ఆషాడ శుద్ధ పౌర్ణమి (గురుపౌర్ణమి) ని పురస్కరించుకొని అమ్మవారికి శాకాంబరీ మహోత్సవాన్ని ఆలయ అర్చకులు మారుపాక ప్రశాంత్ శర్మ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం 4 గంటలకు అభిషేకము, 6 గంటలకు అర్చన కార్యక్రమాలను పూర్తి చేశారు. అనంతరం భక్తులు, దాతలు సమర్పించిన వివిధ రకాల కూరగాయలు, ఆకు కూరలయ, పండ్లతో అమ్మవారిని, గర్భాలయ ప్రాంగణాన్ని ప్రత్యేక అలంకరించారు. శాకంబరీగా అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు తనివితీర దర్శించుకొని తన్మయత్వం పొందారు. అలయ ప్రాంగణంలో శ్రీ లలితా సహస్రనామ స్తోత్ర పారాయణాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనడంతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది.

# ఘనంగా గ్రామదేవత కొలుపు మహోత్సవ వేడుకలు



**ముత్తారం,జూలై 29(జనంసాక్షి):** పెద్దపెల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలో బుధవారం గ్రామదేవత కొలుపు మహోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని గ్రామదేవత ఆలయంలో స్థానిక సర్పంచ్ సుధాటి రవీందర్‌రావు దంపతులు గ్రామస్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలిచారు. వేడుకల్లో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు సంప్రదాయబద్ధంగా రంగురంగుల బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి బోనాలు సమర్పించారు. డప్పు, మంగళ వాయిద్యాల నడుమ భక్తి గీతాలతో గ్రామమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. గ్రామ ప్రజలు అమ్మవారి ఆశీస్సులతో గ్రామంలో సుఖశాంతులు, పాడిపంటలు పండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని సర్పంచ్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని మహోత్సవాన్ని విజయవంతం చేసి గ్రామస్తుల ఐకమత్యానికి ఈ వేడుకలు నిదర్శనంగా నిలిచాయి.

# తెలుగు సాహిత్య శిఖరాలను అధిరోహించిన మహాకవి సినారె

- సినారె కవిత్వం భావజాలానికి ప్రతిబింబం
- రా.సి.జి.ర.సంఘం అధ్యక్షులు ఎలగొండ రవి, ఆడెపు లక్ష్మణ్



**సిరిసిల్ల టౌన్, జూలై 29 (జనంసాక్షి):** తెలుగు సాహిత్యాన్ని, చలనచిత్ర రంగాన్ని తన కవిత్వంతో, గజల్లతో, వేలాది భావోద్వేగభరిత సినీ గీతాలతో విశిష్ట శిఖరాలకు తీసుకెళ్లిన మహాకవి, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, పద్మభూషణ్ డాక్టర్ సి. నారాయణరెడ్డి (సినారె) అని జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఎలగొండ రవి, మానేరు రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి ఆడెపు లక్ష్మణ్ పేర్కొన్నారు. బుధవారం సిరిసిల్లలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో డాక్టర్ సి. నారాయణరెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ, రాజన్న సిరిసిల్ల జిల్లా హన్మాజీపేట గ్రామంలో 1931 జూలై 29న జన్మించిన సినారె తెలుగు సాహిత్య రంగంలో చిరస్థాయిగా నిలిచిన మహాకవిగా గుర్తింపు పొందారని తెలిపారు. అనేక కావ్యగ్రంథాలను రచించినప్పటికీ, "విశ్వంభర" కావ్య సంపుటితో జ్ఞానపీఠ అవార్డు అందుకోవడం ఆయన ప్రతిభకు నిదర్శనమని పేర్కొన్నారు. మన జిల్లాకు చెందిన మహనీయుడు దేశవ్యాప్తంగా ఖ్యాతి గడించడం గర్వకారణమని, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా, ఉపకులపతిగా సేవలందించడంతో పాటు రాజ్యసభ సభ్యుడిగా కూడా విశిష్ట సేవలు అందించారని కొనియాడారు. "డా.సి.నారాయణరెడ్డి తెలుగు సాహిత్యాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన మహనీయుడు. ఆయన రచనలు తరతరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయి" అని పేర్కొన్నారు. "సినారె కవిత్వం భావజాలానికి ప్రతిబింబం. ఆయన సినీ గీతాలు తెలుగు భాష సౌందర్యాన్ని ప్రపంచానికి పరిచయం చేశాయి" అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు మైలారం తిరుపతి, ఉపాధ్యాయులు రాజలింగం, సతీష్ బాబు, జయంతి, అర్చన, వైదేహి, కే.మంజుల, రేణుక, స్వప్న, వసంత, రమణాదేవి, విమోచన, టీ.మంజుల తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**కమాన్‌పూర్, జూలై 29 (జనంసాక్షి):** భారీ వర్షాల నేపథ్యంలో పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం పెంచికల్‌పేట్ గ్రామ సర్పంచ్ పల్లె మాధవి నారాయణ ఆధ్వర్యంలో గ్రామంలోని లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. వర్షాల కారణంగా అధిక నీటి ప్రవాహంతో ఉధృతంగా ప్రవహిస్తున్న మద్దెల వాగును పరిశీలించి, ప్రజల భద్రత దృష్ట్యా గ్రామ నాయకుడు నారాయణ స్వయంగా గ్రామ పంచాయతీ ట్రాక్టర్ నడుపుతూ వాగుకు ఇరువైపులా ఉన్న రహదారిపై ఎవరూ దాటకుండా ముళ్ల పొదలను అడ్డంగా ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు అవసరం లేకుండా వరదనీరు ప్రవహిస్తున్న ప్రాంతాలకు వెళ్లవద్దని, అధికారులు మరియు గ్రామ పంచాయతీ సూచనలను తప్పనిసరిగా పాటించాలని పంచాయతీ కార్యదర్శి ప్రవళిక కోరారు. ప్రజల ప్రాణ భద్రతే అత్యంత ముఖ్యమని పేర్కొంటూ, పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చే వరకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ పల్లె మాధవి నారాయణ విజ్ఞప్తి చేశారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ సహజం

- కొల్ల రాజిరెడ్డి సేవలు అభినందనీయం
- జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి అంజనేయరావు



వీణవంక, జూలై 29 (జనంసాక్షి): ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ సహజమని, పదవీ విరమణ పొందుతున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కొల్ల రాజిరెడ్డి విద్యారంగానికి అందించిన సేవలు అభినందనీయమని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి అంజనేయరావు అన్నారు. వీణవంక మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కొల్ల రాజిరెడ్డి 35 సంవత్సరాల పాటు ఉపాధ్యాయుడిగా, అనంతరం ప్రిన్సిపాల్‌గా విద్యారంగానికి సేవలందించి ఈ నెల 31న పదవీ విరమణ పొందనున్న సందర్భంగా బుధవారం లక్ష్మీ గణపతి ఫంక్షన్ హాల్‌లో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అంజనేయరావు మాట్లాడుతూ, సమాజంలో ఉపాధ్యాయ వృత్తి అత్యంత గౌరవప్రదమైనదని అన్నారు. కొల్ల రాజిరెడ్డి తన జీవితాన్ని విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణానికి అంకితం చేశారని కొనియాడారు. ప్రతి ఉద్యోగి పదవీ విరమణ అనంతరం కూడా సమాజ సేవలో ముందుండాలని సూచించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు, మండలంలోని వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, ప్రజాప్రతినిధులు కొల్ల రాజిరెడ్డిని పూలమాలలు, శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు కొల్ల రాజిరెడ్డి దంపతులకు గజమాల వేసి ప్రత్యేకంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శోభారాణి, స్థానిక సర్పంచ్ సరోజన-రాజేంద్ర ప్రసాద్, ప్రిన్సిపాల్స్ సంఘం అధ్యక్షుడు మహేందర్, జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సత్య ఆనందరావు, ప్రిన్సిపాళ్లు సత్యనారాయణ, అంజనేయ, రాజేశ్వరరావు, శశిధర్ రెడ్డి, టీఎన్‌జీవో సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు సర్దార్ బల్బీర్ సింగ్, లైబ్రరీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్, జిల్లా జూనియర్ కళాశాల సంఘం అధ్యక్షుడు బండి రాజశేఖర్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ దామోదర్, ఉపాధ్యాయులు నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రొంపికుంట గ్రామాల మధ్య రాకపోకలకు ఇక్కట్లు



**కమాన్‌పూర్, జూలై 29 (జనంసాక్షి):** పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలంలోని పేరపల్లి రొంపికుంట గ్రామాల మధ్య ఉన్న ప్రధాన రహదారిపై కల్వర్ట్ వద్ద వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమస్యను గుర్తించిన అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టినప్పటికీ పరిస్థితి పూర్తిగా సాధారణ స్థితికి రాలేదని స్థానికులు తెలిపారు. ప్రధానరగా వర్షాకాలం నేపథ్యంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున సంబంధిత అధికారులు వెంటనే శాశ్వత మరమ్మతులు చేపట్టి రహదారిని పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రస్తుతం వాహనదారులు అప్రమత్తంగా ప్రయాణించాలని స్థానికులు సూచిస్తున్నారు.

# నారాయణపూర్ గ్రామంలో వర్షానికి నాని కూలిన ఇల్లు

**గంగాధర జూలై 29 (జనంసాక్షి):** మంగళవారం నుండి కురుస్తున్న వర్షాలకు మండలంలోని నారాయణపూర్ గ్రామంలో జెడ రాజయ్య అనే వ్యక్తి ఇల్లు గోడలు పైకప్పు నాని బుధవారం కూలిపోయింది ఇంటి పైకప్పు కూలడంతో ఇంటిలోని వంట సరుకులు సామాగ్రి బట్టలు తడిసిపోయాయి పేద కుటుంబానికి చెందిన జెడ రాజయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి తక్షణ సహాయం అందించాలని మాజీ సర్పంచ్ ఎండి నజీర్ హుస్సేన్ కోరారు.



## నెమలి సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (జనం సాక్షి) :** కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజక వర్గంలోని నసుల్రాబాద్ మండలంలోని నెమలి గ్రామంలో ఉన్న సాయిబాబా దేవాలయంలో బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుల ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాయిబాబా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, జిల్లా ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, అందరికీ ఆయురారోగ్యాలు కలగాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ప్రార్థనలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లి కార్జున్‌ను శాలువాతో సత్కరించి ఆశీర్వాదం అందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐ భుజంగారి భాస్కర్ రెడ్డి, నిజాంసాగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రజా పండరి, నసుల్రాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయ్ కుమార్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు యశ్వంత్ రెడ్డి, కమ్మ సత్యనారాయణతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు

## గడ్కోల్ గ్రామంలో డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి అధికారుల పరిశీలన



**సిరికొండ జూలై 29 (జనం సాక్షి ):** గడ్కోల్ గ్రామంలోని కప్పల వాగు బ్రిడ్జి సమీపంలో రెండు వైపులా నెలకొన్న డ్రైనేజీ సమస్యలను పరిష్కరించేందుకు గ్రామ ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి స్థలాన్ని పరిశీలించి చర్చించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీవో తారాచంద్ హాజరై సమస్య తీవ్రతను పరిశీలించి, శాశ్వత పరిష్కారం కోసం అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లతా శంకర్, ఉప సర్పంచ్ సంపత్ రెడ్డి, గంగారెడ్డి, భానుచందర్, శ్రీనివాస్ రెడ్డి తదితర గ్రామ నాయకులు, గ్రామస్తులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. గ్రామ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా డ్రైనేజీ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని వారు కోరారు.

# జిల్లాలో ఆహార భద్రత ప్రమాణాల అమలుకు కఠిన చర్యలు



**కామారెడ్డి, జిల్లా ప్రతినిధిజూలై 29( జనం సాక్షి)**జిల్లాలో ప్రజలకు సురక్షితమైన, పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారం అందించేందుకు ఆహార భద్రత ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. బుధవారం రాష్ట్ర ఆహార నియంత్రణాధికారి వి. ఆనంద రావు జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి జిల్లాలో ఆహార భద్రత, పరిశుభ్రత ప్రమాణాలు, తనిఖీల నిర్వహణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జాతీయ రహదారుల వెంట ఉన్న ధాబాలు, హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార నాణ్యతపై విస్తృత తనిఖీలు చేపట్టి కల్తీ ఆహారాన్ని పూర్తిగా అరికట్టాలని సూచించారు. అలాగే రెసిడెన్షియల్ హాస్టళ్లు, గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లు, మధ్యాహ్న భోజన వంటశాలల్లో క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించి విద్యార్థులకు సురక్షితమైన, పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రెస్టారెంట్లలో వంటశాలల పరిశుభ్రత, సురక్షితమైన తాగునీటి అందుబాటు, ముడి ఆహార పదార్థాల సరైన నిల్వ, చీడపీడల నియంత్రణ, ఎఫ్ఎస్ఎస్ఏఐ (ఖీూూ×) నిబంధనల ప్రకారం ఆహార పదార్థాల తయారీ, నిల్వ, ప్యాకింగ్ ప్రక్రియలను తప్పనిసరిగా అమలు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఆహార నిర్వహణలో పనిచేసే సిబ్బంది ఆరోగ్య ధృవపత్రాలు కలిగి ఉండటంతో పాటు గ్లౌజులు, ఏప్రాన్లు ధరించి వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ప్రతి ఆహార సంస్థలో ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్, ఆహార భద్రత సూచన బోర్డు, ధరల జాబితాను ప్రజలకు స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటూ, జిల్లాలో నిరంతరం ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ప్రజారోగ్య పరిరక్షణకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని కామారెడ్డి ఫుడ్ సేఫ్టీ అధికారికి కలెక్టర్ స్పష్టం చేశారు. రాష్ట్ర ఆహార నియంత్రణాధికారి వి. ఆనంద రావు మాట్లాడుతూ, జిల్లాలో ఆకస్మిక తనిఖీలతో పాటు ప్రజల్లో ఆహార భద్రతపై అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించి సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందుబాటులో ఉండేలా చర్యలు చేపడతామని తెలిపారు. ఈ సమావేశంలో నిజామాబాద్ గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ టి. సునీత, కామారెడ్డి ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ జి. విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామ్ సాగర్, నిజాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీరు

- **వరద నీటితో సంతరించుకున్న జలకళ**
- **వరద నీరు ఇలాగే కొనసాగితే పూర్తిగా నిండే ఆస్కారం**

**నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల బ్యూరో (జనం సాక్షి) :**
నిజామాబాద్,నిర్మల్ ఆదిలాబాద్ జిల్లాలకు వరప్రదాయని శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్,ఈ ప్రాజెక్టుకి ప్రధానంగా మూడు ప్రధాన కాలువలు ఏర్పాటు చేయ డం జరిగింది లక్ష్మీ కాలువ, సరస్వతి కాలువ, కాకతీయ కాలువ ఈ మూడు కాలువలలో కాకతీయ కాలువ అత్యంత పొడవైన కాలువగా అవతరించింది. శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు: శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుండి 4051 క్యూసెక్కుల వరద నీరు కొనసాగుతోంది. అవుట్ ఫ్లో 751 క్యూసెక్కులు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు 80 టీఎంసీలు, ప్రస్తుతం 1065.30 అడుగులు 16,405 టీఎంసీలు నీటి నిలువ ఉన్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. గత సంవత్సరం ఇదే సమయానికి 1075 అడుగులు 32,897 టీఎంసీలో నీరు నిల్వ ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం సాగునీరుకు నీళ్లు ఇవ్వడం లేదని, త్రాగునీరుకు ఇతర అవసరాలకు 751 క్యూసెక్కుల నీరు దిగువకు వదిలినట్లు అధికారులు తెలిపారు. ఇదే విధంగా వర్షం కొనసాగితే ప్రాజెక్టు నీటిమట్టం పూర్తిస్థాయిలో నిండే అవకాశాలు ఉన్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. రైతులలో ఆనందం: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీరు రావడంతో రైతులలో ఆనందం నెలకొంది ప్రాజెక్టు నిండుకుండలా దర్శనమిస్తుందని తమ వ్యవసాయ సాగుకి, త్రాగునీరుకి ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. లక్ష్మీ కాలువ క్రింద 37 వేల హెక్టార్లలో వ్యవసాయం సాగు చేస్తున్నట్లు అధికారులు అంచనా వేశారు.



**నిజాంసాగర్ ప్రాజెక్టు:** నిజాంసాగర్ ప్రాజెక్టు లోకి వరద ప్రవాహం కొనసాగుతుంది బుధవారం 6585 క్యూసె క్కుల ఇన్ఫ్లో నమోదయిందని ప్రాజెక్ట్ ఏ ఈ ఈ సాకేత్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 17. 802 టీఎంసీలు కాగా ప్రస్తుతం 7. 139 టీఎంసీల నీరు వచ్చి చేరిందని వెల్లడించారు మరోవైపు ప్రాజెక్టు నుంచి ఆవిరి లీకేజీ రూపంలో 141 క్యూసెక్కుల నీరు వృధాగా బయటకు వెళుతుందన్నారు ఇలాగే వరద ప్రవాహం కొనసాగితే రానున్న రోజుల్లో నీటి నిలువలు మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. అలాగే కళ్యాణి ప్రాజెక్టు నుండి 180 క్యూసెక్కుల నీటిని నిజాంసాగర్ ప్రాజెక్టు ప్రధాన కాలువకు మళ్ళిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కళ్యాణి ప్రాజెక్టు నీటిమట్టం 408.60 మీటర్లుగా నమోదయింది కళ్యాణి ప్రాజెక్టు డైవర్షన్ పథకం కావడంతో నీటి నిల్వ సామర్థ్యం లేదని అధికారులు తెలిపారు మొత్తం 430 క్యూసెక్కుల నీరు విడుదల అవుతుండగా ప్రధాన కాలువకు నీటి మళ్లింపు కొనసాగుతుందని రైతుల అవసరాలకు అనుగుణంగా నీటి సరఫరాను కొనసాగించేందుకు అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.



## దెబ్బతిన్న రోడ్డుకు తక్షణ మరమ్మతులు చేయాలి

### 13వ వార్డు కౌన్సిలర్ లలిత చిట్టిబాబు



**కామారెడ్డి, జిల్లా ప్రతినిధిజూలై 29 (జనం సాక్షి)**కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని 13వ వార్డు టెక్రియాల్ గ్రామంలో వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్డును తక్షణమే మరమ్మతులు చేసి ప్రజల రాకపోకలకు అనుకూలంగా మార్చాలని 13వ వార్డు కౌన్సిలర్ లలిత చిట్టిబాబు అధికారులను కోరారు. రోడ్డు దుస్థితిపై గ్రామస్తుల ఫిర్యాదుల నేపథ్యంలో గురువారం పంచాయతీరాజ్ ఏఈ సంబంధిత ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు విస్తరణ, మరమ్మతుల కోసం ప్రస్తుతం తమ శాఖ వద్ద బడ్జెట్ అందుబాటులో లేదని, ఎమ్మెల్యే నిధుల ద్వారా పనులు చేపట్టాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ లలిత చిట్టిబాబు మాట్లాడుతూ, ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా రోడ్డు మరింత దెబ్బతిందని, మరోసారి భారీ వర్షాలు కురిస్తే వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయే ప్రమాదం ఉందన్నారు. టెక్రియాల్ గ్రామంతో పాటు బ్రాహ్మణపల్లి, సంగో జివాడి, కాలేజీవాడి, చందాపూర్ గ్రామాలకు చెందిన ప్రజలు ఇదే రహదారిపై నిత్యం ప్రయాణిస్తున్నారని, విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అందువల్ల ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే నిధుల ద్వారా వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టి శాశ్వత పరిష్కారం చూపాలని ఆమె ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సందీప్, గడ్డమీది రాజు, రాజేందర్, పాల రాజు, సాయిలు, రాజయ్య, అనిల్ గ్రామస్తులు పాల్గొన్నారు

# ఫీజు బకాయి - బిజెపి లడాయి



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 29:( జనం సాక్షి )**ఫీజు బకాయి బీజేపీ లడాయి కార్యక్రమంలో భాగంగా కిట్స్ కళాశాలలో బీజేవైఎం ఆధ్వర్యంలో విద్యార్థుల సంతకాల సేకరణ ,కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన "ఫీజు బకాయి -- బీజేపీ లడాయి" కార్యక్రమంలో భాగంగా నిజామాబాద్ జిల్లా బీజేవైఎం అధ్యక్షులు వంశీ గౌడ్ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లాలోని కిట్స్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో సమావేశం నిర్వహించి. బీజేవైఎం తెలంగాణ రాష్ట్ర కో-కోశాధికారి అమంద్ విజయ్ కృష్ణ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నప్పటికీ విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఫీజులు చెల్లించలేక వేలాది మంది విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని, కొంతమంది విద్యార్థులు అప్పులు చేసి చదువులు కొనసాగించే పరిస్థితి ఏర్పడిందన్నారు. విద్య అనేది ప్రతి విద్యార్థి హక్కు అని, ఆ హక్కును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో యువతకు, విద్యార్థులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించే వరకు బీజేవైఎం పోరాటం ఆగదని స్పష్టం చేశారు. జిల్లా బీజేవైఎం అధ్యక్షులు వంశీ గౌడ్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న 'ఫీజు బకాయి బీజేపీ లడాయి'ఉద్యమానికి విద్యార్థుల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. .జిల్లాలోని కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు వెంటనే చొరవ చూపి విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేసేలా కృషి చేయాలని లేని యెడల ఇందూరు జిల్లాలో మిమ్మల్ని అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో బీజేవైఎం నాయకులు విపుల్ రావు, రాజ్ గణేష్, రాకేష్, సిసింద్రీ, రాజశేఖర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# భగత్‌నగర్ డెకాయిటీ కేసు ఛేదన..

కరీంనగర్ బ్యూరో, జూలై 29 (జనంసాక్షి): కరీంనగర్ నగరంలోని భగత్‌నగర్‌లో ఇటీవల సంచలనం సృష్టించిన ఇంటి డెకాయిటీ కేసును కరీంనగర్ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌కు చెందిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.2.09 లక్షల నగదు, 43.67 గ్రాముల బంగారు ఆభరణాలు, 64.98 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం వెల్లడించారు.ఘటన వివరాలుభగత్‌నగర్‌కు చెందిన ఎం.డి. అజ్మత్ అలీ నివాసంలో అర్ధరాత్రి సమయంలో దమ్మీ పిస్టల్స్, కత్తులతో ఇంట్లోకి చొరబడిన దుండగులు కుటుంబ సభ్యులను బెదిరించి, వారి చేతులు, కాళ్లు కట్టేసి నగదు, బంగారం, వెండి ఆభరణాలను దోచుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ప్రత్యేక పోలీసు బృందాలు దర్యాప్తు చేపట్టి, ఘటనాస్థలం పరిసరాలు మరియు నిందితులు పారిపోయిన మార్గాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించాయి.దర్యాప్తులో నిందితులు దోపిడీ అనంతరం దొంగిలించిన ద్విచక్ర వాహనాలపై హుజురాబాద్ వైపు వెళ్లి, పెద్ద పాపయ్యపల్లి సమీపంలో వాటిని వదిలివెళ్లినట్లు గుర్తించారు. సాంకేతిక ఆధారాల ద్వారా నిందితులు ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌కు చెందిన వారని పోలీసులు నిర్ధారించారు. యూపీలో గాలింపు.. ముగ్గురు అరెస్ట్‌కరీంనగర్ పోలీసుల ప్రత్యేక బృందాలు మీరట్‌కు వెళ్లి స్థానిక పోలీసుల సహకారంతో గాలింపు చేపట్టాయి. ఈ క్రమంలో పోలీసుల నుంచి తప్పించుకునేందుకు రైల్వే స్టేషన్‌కు వెళ్తున్న ముగ్గురు నిందితులను జూలై 29న అదుపులోకి తీసుకున్నారు.

**అరెస్టయిన నిందితులు:**

సల్మాన్ ఏ భూరే ఏ యాదవ్ (22) ? రూ.84,000 నగదు, 11.95 గ్రాముల బంగారం స్వాధీనం.సల్మాన్ ఏ విమాన్ (22) ? రూ.67,000 నగదు, 11.71 గ్రాముల బంగారం స్వాధీనం.మొహమ్మద్ హాసీన్ (19) ? రూ.58,000 నగదు, 14.01 గ్రాముల బంగారం స్వాధీనం.మొత్తంగా రూ.2.09 లక్షల నగదు, 43.67 గ్రాముల బంగారు ఆభరణాలు, 64.98 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు సీపీ తెలిపారు.సొంత అల్లుడు, మనుమడే కుట్రకు సూత్రధారులుదర్యాప్తులో బాధితుడు ఎం.డి. అజ్మత్ అలీ సొంత అల్లుడు రజావుద్దీన్ (ఎ1), మనుమడు అజీమ్ రజా (ఎ2) ఈ డెకాయిటీకి ప్రధాన సూత్రధారులుగా పోలీసులు గుర్తించారు. రజావుద్దీన్‌పై గతంలో హత్య, ఆయుధాల కేసులతో పాటు పలు నేర కేసులు నమోదై ఉన్నాయని పోలీసులు తెలిపారు. కుటుంబ కలహాల నేపథ్యంలో అతని భార్య పుట్టింటికి రావడం, అనంతరం రజావుద్దీన్‌కు బాధిత కుటుంబం చికిత్స చేయించడం, బట్టల వ్యాపారం ప్రారంభించేందుకు ఆర్థిక సహాయం అందించడం జరిగిందన్నారు. అయితే వ్యాపారంలో నష్టపోయిన రజావుద్దీన్ తరచూ డబ్బులు డిమాండ్ చేస్తూ వేధించేవాడని, రూ.5 లక్షలు ఇవ్వాలని ఒత్తిడి చేయగా నిరాకరించడంతో దోపిడీకి కుట్ర పన్నినట్లు దర్యాప్తులో తేలిందన్నారు.

కరీంనగర్‌లో బాధితుడి ఇంట్లో నివసించిన సమయంలో ఇంట్లో ఉన్న నగదు, బంగారు ఆభరణాలపై పూర్తి సమాచారం సేకరించిన రజావుద్దీన్, తన కుమారుడు అజీమ్ రజా, మీరట్‌కు చెందిన మరో ముగ్గురితో కలిసి పథకం రచించాడు. ఈ నెల 20న మీరట్ నుంచి రామగుండం చేరుకుని, 21వ తేదీ అర్ధరాత్రి దమ్మీ పిస్టల్స్, కత్తులతో ఇంట్లోకి ప్రవేశించి కుటుంబ సభ్యులను బెదిరించి దోపిడీకి పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు.

**ప్రధాన నిందితుల కోసం గాలింపు**

అరెస్టయిన ముగ్గురు నిందితులను మీరట్ న్యాయస్థానంలో హాజరుపరిచి ట్రాన్సిట్ వారెంట్‌పై కరీంనగర్‌కు తరలిస్తున్నట్లు సీపీ తెలిపారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితులు రజావుద్దీన్ (ఎ1), అజీమ్ రజా (ఎ2)తో పాటు ఇతర నిందితుల కోసం ప్రత్యేక పోలీసు బృందాలు ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.

## 2న సింగరేణి ఏరియా ఆసుపత్రిలో
# సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరం

గోదావరిఖని, జనంసాక్షి: సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్), రామగుండం ఏరియా ఆసుపత్రిలో ఆగస్టు 2వ తేదీ (ఆదివారం) ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ప్రముఖ శ్రీకర హాస్పిటల్స్ ఆధ్వర్యంలో సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఏరియా ఆసుపత్రి అదనపు చీఫ్ మెడికల్ ఆఫీసర్ (అడ్మిన్) తెలిపారు.ఈ వైద్య శిబిరంలో న్యూరాలజీ (మెదడు, నరాల సంబంధిత వ్యాధులు), యూరాలజీ (మూత్రపిండాలు, మూత్రనాళ సంబంధిత వ్యాధులు), నెఫ్రాలజీ (కిడ్నీ వ్యాధులు),గ్యాస్ట్రోఎంటరాలజీ (జీర్ణాశయ సంబంధిత వ్యాధులు) రంగాలకు చెందిన శ్రీకర హాస్పిటల్స్‌కు చెందిన ప్రముఖ సూపర్ స్పెషాలిటీ వైద్యులు సేవలు దించనున్నారు.ఈ శిబిరంలో సింగరేణి అధికారులు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, సీపీఆర్ఎంఎస్-ఈ, సీపీఆర్ఎంఎస్ -ఎన్ఈ కార్డు కలిగిన పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, వారి జీవిత భాగస్వాములు వైద్య పరీక్షలు, నిపుణుల సలహాలు పొందేందుకు అర్హులని పేర్కొన్నారు.వైద్య శిబిరానికి హాజరుకావాలనుకునే అర్హులైన లబ్ధిదారులు ఈ నెల 29 నుంచి రామగుండం ఏరియా ఆసుపత్రిలో ముందస్తుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ముందస్తు నమోదు చేసుకున్న వారికి మాత్రమే వైద్యుల వద్ద సంప్రదింపులు కల్పించబడతాయని స్పష్టం చేశారు.

## గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించిన జిల్లా కోర్టు బార్ అసోసియేషన్



కరీంనగర్ లీగల్, జూలై 29 ( జనం సాక్షి) కరీంనగర్ జిల్లా కోర్టు ప్రాంగణంలో బుధవారం గురు పౌర్ణమి దినోత్సవ వేడుకలను జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, జనరల్ సెక్రటరీ చంద్రపాటి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు నారాయణ రెడ్డి, హన్మంతరావు, మనోహర్‌రావు, మాధవరావు లను బార్ అసోసియేషన్ కార్యవర్గం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గడ్డం లక్ష్మణ్ మాట్లాడుతూ గురు పౌర్ణమి రోజున న్యాయవృత్తిలో అనుభవజ్ఞులైన సీనియర్ న్యాయవాదులను సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్‌ను కూడా శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ వేడుకల్లో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బండ శివకుమార్, జాయింట్ సెక్రటరీ సుంకే దేవకిషన్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ బెజ్జంకి శ్రీకాంత్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఉపాధ్యాయుల కరుణశ్రీతో పాటు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్నేహపూర్వక వాతావరణంలో నిర్వహించిన ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.



## కూలిన ప్రహరీ గోడను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేష్

సుల్తానాబాద్,జూలై 29(జనంసాక్షి) : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో, 9వ వార్డు గాంధీనగర్లో కూలిన ప్రహరీ గోడను మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేష్,వార్డు కౌన్సిలర్ తొ గ్రి,కొండ ప్రభాకర్ తో కలిసి పరిశీలించారు.నష్టపరిహారం ఇప్పించాలని పోగుల రమేష్,బ్రహ్మం కమిషనర్ తిప్పరాజు రమేష్ ను వేడుకున్నారు.

## భారీ వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
## ఎస్ ఐ. రవి కిరణ్

కథలాపూర్ జూలై 29 (జనంసాక్షి) కథలాపూర్ మండల ప్రజలకు భారీ వర్షాలు కారణంగా వరదలు సంభవించే అవకాశం ఉంది ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కథలాపూర్ పోలీస్ ఎస్ఐ.రవి కిరణ్ తెలియజేయడం జరిగింది. అధికారుల సూచనలు పాటించి ప్రాణాలు మరియు ఆస్తుల భద్రతకు సహకరించాలని తెలియజేశారు. వర్షం పడుతున్నప్పుడు లేదా వరదల సమయంలో పాటించవలసినవి పశువులను సురక్షిత ప్రాంతాల వద్దనే రక్షణ ఉంచాలని విద్యుత్ స్తంభాలు వైర్లు ట్రాన్స్ఫర్ ల దగ్గరికి వెళ్ళవద్దు శిథిలా అవస్థలో ఉన్న ఇండ్లు గోడల దగ్గర ఉండవద్దు అని అధికారుల సూచనలు ప్రజలు పాటించాలని అత్యవసర సహాయం కోసం వెంటనే డయల్ 100 కు కాల్ చేస్తే సహాయం అందుతుంది అని కథలాపూర్ ఎస్ఐ రవి కిరణ్ తెలియజేయడం జరిగింది.



## వీణవంక లో అమిత్ ఇండియా ఈవీ బైక్స్ షోరూమ్ ప్రారంభం

వీణవంక జూలై 29 (జనం సాక్షి) వీణవంక మండల కేంద్రంలో అమిత్ ఇండియా ఈవీ బైక్స్ షోరూమును బుధవారం ప్రారంభించారు.ఈ షోరూమ్‌ను వీణవంక గ్రామ సర్పంచ్ దాసారపు సరోజన - రాజేంద్ర ప్రసాద్,ఉప సర్పంచ్ తాళ్లపల్లి మహేష్ గౌడ్,అమిత్ ఇండియా ఫౌండర్ మెంబర్ ఎడ్ల ఉప్పల్ రెడ్డి,రామిడి శ్రీనివాస్ సంయుక్తంగా కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,పర్యావరణ పరిరక్షణకు తోడ్పడే విద్యుత్ వాహనాల వినియోగం రోజు రోజుకు పెరుగుతోందని, వినియోగదారులకు నాణ్యమైన సేవలు,అత్యుత్తమ ఈవీ బైక్స్ అందుబాటులోకి తీసుకురావడమే ఈ షోరూమ్ లక్ష్యమని వారన్నారు.ఈ షోరూమ్ యజమానులు వీణవంక ఉప సర్పంచ్ తాళ్లపల్లి మహేష్ గౌడ్, కటకోయిల సంపత్ లు గ్రామ సర్పంచ్ దాసర సరోజన రాజేంద్ర ప్రసాద్ లకు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వ్యాపారవేత్తలు,యువత,స్థానిక ప్రముఖులు,గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని షోరూమ్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.



## భూషణరావుపేట లో ఎస్ ఐ ఆర్ వంద శాతం పూర్తి
### బి యల్ ఓ లను ఘనంగా సన్మానించిన సర్పంచ్ బద్ద మహేందర్

కథలాపూర్, జూలై 29 (జనంసాక్షి) కథలాపూర్ మండలం లోని భూషణరావుపేట గ్రామంలో సమగ్ర ఓటర్ జాబితా ప్రత్యేక సవరణ ఎస్ ఐ ఆర్.ను100% విజయవంతంగా డిజిటలైసెషన్ పూర్తిచేసిన సందర్భంగా బి యల్ ఓ లు ,కూన శారదా, తాటిపాముల మల్లీశ్వరి, మరియు జి పి ఓ. ప్రశాంత్ ను గ్రామ సచివాలయం వద్ద గ్రామ సర్పంచు బద్దం మహేందర్ రెడ్డి, మరియు బి యల్ ఏ లు గడ్డం శేఖర్ రెడ్డి, బద్దం మహిపాల్ రెడ్డి తుమ్మనపెల్లి మహేష్, బత్తిని నవీన్, కూన అశోక్,కారోబార్ అంబల్ల అశోక్,పుంగ్ర జనార్దన్ రెడ్డి పాలుగొని సర్పంచి మహేందర్ ఆధ్వర్యంలో బి యల్ ఓ లను జీ పీ ఓ ను ఘనంగా సన్మానం చేయడం జరిగింది.






**తిమ్మాపూర్ జులై,29(జనంసాక్షి )**
మానకొండూర్ నియోజకవర్గం గుండ్లపల్లి మాజీ సర్పంచ్ సమత భర్త,స్థానిక నాయకుడు బెటెల్లి రాజేందర్ రెడ్డి ఆత్మహత్య ఉదంతం ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతోంది.మానకొండూర్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ వద్ద రాజేందర్ రెడ్డి ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టి,ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడం స్థానికంగా రాజకీయ దుమారాన్ని రేపింది.అయితే,ఈ ఘటన జరిగి రోజులు గడుస్తున్నా కేసు విచారణలో ఆశించిన పురోగతి కనిపించకపోవడంపై బాధితులు, ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

**స్పాట్ ఎఫ్ఐఆర్ ఉన్నా నిందితులెక్కడ..?చట్టం అధికారం ఉన్నవారికి చుట్టమా..?**
రాజేందర్ రెడ్డి మృతి చెందిన అనంతరం బాధితులు, కుటుంబ సభ్యులు కరీంనగర్ సివిల్ ఆసుపత్రి వద్ద, గుండ్లపల్లి ప్రధాన రహదారిపై తీవ్ర నిరసనలు,ధర్నాలు నిర్వహించారు.ఆ సమయంలో పోలీసులు రంగప్రవేశం చేసి స్పాట్ ఎఫ్ఐఆర్ నమోదు చేసినప్పటికీ,ఘటనకు కారణమైన ప్రధాన నిందితులను ఇప్పటివరకు ఎందుకు అరెస్ట్ చేయలేదన్న ప్రశ్నలు గట్టిగా వినిపిస్తున్నాయి. సామాన్యుల విషయంలో క్షణాల్లో స్పందించే పోలీసులు, అధికార పార్టీ నేతల నీడలో ఉన్నవారి విషయంలో కాలయాపన చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు.

**మరణ వాంగ్మూలాన్ని సైతం పక్కన పెట్టారా?**
మరణించే ముందు రాజేందర్ రెడ్డి ఇచ్చిన మరణ వాంగ్మూలంలో స్పష్టమైన ఆధారాలు ఉన్నప్పటికీ,నిందితులను స్వేచ్ఛగా తిరగనివ్వడం వెనుక ఎవరి ఒత్తిడులు ఉన్నాయన్నది నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది.

**నిందితులకు ధీమా పెంచిన 'ఎమ్మెల్యే హామీ..'?**
ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రధాన నిందితులకు ఇప్పటికే నేర చరిత్ర ఉందనే ప్రచారం గుప్పుమంటోంది.?షాడో ఎమ్మెల్యే అదృశ్యం నియోజకవర్గంలో చక్రం తిప్పుతూ 'షాడో ఎమ్మెల్యే'గా వ్యవహరిస్తున్న వ్యక్తి ప్రస్తుతం ఎక్కడ ఉన్నాడనేది ప్రశ్నార్థకంగా మారింది.?

**బాధితులను పరామర్శించని ఎమ్మెల్యే..**

**మాజీ ఎమ్మెల్యే రసమయి తీవ్ర ధ్వజం**
తన నియోజకవర్గానికి చెందిన ఒక ప్రజాప్రతినిధి భర్త ఆత్మహత్య చేసుకుని,కుటుంబం రోడ్డున పడితే మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కనీసం బాధితులను పరామర్శించడానికి కూడా వెళ్లకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అభయం తమకు ఉందనే ధీమాతోనే ఆ నలుగురు నిందితులు కళ్ళ ముందే తిరుగుతున్నారని మాజీ ఎమ్మెల్యే రసమయి ఆరోపిస్తున్నారు.అలాగే రాజేందర్ రెడ్డి ఆత్మహత్య వెనుక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రమేయం స్పష్టంగా ఉంది.ఇప్పటికైనా ఉన్నతాధికారులు నిష్పాక్షికంగా స్పందించి,మరణ వాంగ్మూలంలో ఉన్న ఐదుగురు నిందితులతో పాటు ఎమ్మెల్యేను కూడా తక్షణమే అరెస్ట్ చేయాలని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ డిమాండ్ చేశారు.

**కుటుంబం మొత్తం ఆత్మహత్య చేసుకుంటామంటూ హెచ్చరిక..**
రాజేందర్ రెడ్డి ఆత్మహత్యతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది.?తమకు న్యాయం జరగకపోతే,భర్త లేని జీవితం వ్యర్థమని,కుటుంబం మొత్తం ఆత్మహత్య చేసుకోవడం తప్ప మరో మార్గం లేదు అని రాజేందర్ రెడ్డి భార్య,మాజీ సర్పంచ్ సమత కన్నీరు మున్నీరవుతున్నారు. చనిపోయిన తర్వాత కూడా సామాన్యుడికి న్యాయం జరగకపోతే ఈ సమాజంలో చట్టంపై నమ్మకం ఎలా ఉంటుందని,గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రతిపక్షాల మౌనమేందుకో..**
చిన్న చిన్న విషయాలకే మీడియా ముందుకు వచ్చి రాద్ధాంతం చేసే ప్రతిపక్ష పార్టీలు,కళ్ళముందే ఒక కుటుంబం బలికావడానికి సిద్ధపడుతున్నా ఎందుకు సరైన రీతిలో పోరాటం చేయడం లేదనే విమర్శలు కూడా వస్తున్నాయి.?ఈ దారుణ ఘటనపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ప్రత్యేక బృందాలతో విచారణ జరిపించి,నిందితులను చట్టం ముందు నిలబెట్టి బాధితులకు న్యాయం చేస్తారో లేదో వేచి చూడాల్సి ఉంది.

## గురు పౌర్ణమి సందర్భంగా దత్తాత్రేయ స్వామికి ప్రత్యేక పూజలు

**ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ శాసనసభ్యులు కటకం మృత్యుంజయం**



**గంభీరావుపేట, జూలై 29 జనంసాక్షి;**
గురు పౌర్ణమి సందర్భంగా ముందుగా విగ్నేశ్వర స్వామి దత్తాత్రేయ స్వామి, సాయిబాబా, ఆలయంలో మాజీ శాసనసభ్యులు కటకం మృత్యుంజయం తోపాటు కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక అర్చనలు చేయించి, రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, రైతులకు సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని ప్రార్థించారు.అనంతరం ఊరు పురోహితులు రాచర్ల పార్థసారథి రాజు పంతులు గారిచే కటకం మృత్యుంజయంకు వేదాశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## రాముని‌పల్లి ఎస్సీ కాలనీలో చెత్త తొలగించండి

**సుల్తానాబాద్,జూలై 29(జనంసాక్షి) :**



మండలంలోని రామునిపల్లి గ్రామ ఎస్సీ కాలనీలో చెత్తను సకాలంలో తొలగించక ˇపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని ఏడో వార్డు సభ్యుడు ఆవునూరి సతీష్ ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ సిబ్బంది ఒకేచోట చెత్తను పోగు చేసినప్పటికీ, దానిని తరలించడం లేదని ఆరోపించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో చెత్త ఇళ్ల వద్దకు చేరి దుర్వాసన, దోమలు, భయంకరమైన వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. అధికారులు వెంటనే స్పందించి చెత్తను తొలగించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ఏడో వార్డు సభ్యుడు ఆవు నూరి సతీష్ తో పాటు కాలనీవాసులు సంబంధిత అధికారులను కోరారు.



## రుద్రంగిలో ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు


**రుద్రంగి జూలై 29 (జనంసాక్షి)**
గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని రుద్రంగి మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఉదయం నుండి ఆలయంలో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి సాయిబాబాకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు.గురు పౌర్ణమి విశిష్టతను పురోహితులు భక్తులకు వివరించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రం గంగ నర్సయ్య ఆధ్వర్యంలో భక్తులకు, గ్రామ ప్రజలకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ అన్నదాన కార్యక్రమంలో వందలాది మంది భక్తులు, గ్రామస్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు,గ్రామ పెద్దలు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

### వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాల పట్ల

## అప్రమత్తత అవసరం

**సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి**

**ముస్తాబాద్ జులై 29 (జనం సాక్షి)**



వర్షాకాలంలో ఈదురుగాలులు, వర్షాల వల్ల విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని మండల సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి సూచించారు. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణాంతకంగా మారుతుందని, ప్రతి ఒక్కరూ విద్యుత్ భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. వర్షం పడే సమయంలో తడిసిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, వేలాడుతున్న తీగలను తాకరాదని హెచ్చరించారు. గృహ వినియోగదారులు తడి చేతులతో స్విచ్‌లు వేయవద్దని, సెల్‌ఫోన్ ఛార్జింగ్‌లో ఉన్నప్పుడు మాట్లాడవద్దని తెలిపారు. ప్లాస్టిక్ దండెలను మాత్రమే వాడాలని, ఐఎస్ఐ ప్రమాణాలు కలిగిన వైరింగ్, ఎర్తింగ్ విధానాలను ఉపయోగిం చాలని స్పష్టం చేశారు. రైతులు మోటార్లు, పైపులు, స్టార్టర్లను సురక్షితంగా పరిశీలించుకోవాలని, స్వయంగా ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫ్యూజులు వేయవద్దని కోరారు. పంట పొలాల చుట్టూ విద్యుత్ ఫెన్సింగ్ పెట్టడం, వేటకు విద్యుత్ వాడటం తీవ్రమైన నేరమని పేర్కొన్నారు. పశువులను విద్యుత్ స్తంభాలకు కట్టేయవద్దని రైతులకు, కాపరులకు సూచించారు. విద్యుత్ షాక్ తగిలితే కర్ర లేదా ప్లాస్టిక్ వస్తువుల ద్వారా బాధితుడిని వేరు చేయాలని, నేరుగా తాకవద్దని చెప్పారు. విద్యుత్ సంబంధిత సమస్యలు లేదా ప్రమాదాలు ఎదురైతే వెంటనే 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

# భారీ వర్షాలు, మెరుపుల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి: జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధిజూలై 29 (జనం సాక్షి)** జిల్లాలో రానున్న రోజుల్లో భారీ వర్షాలు, ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులు సంభవించే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని పేర్కొంటూ, అధికార యంత్రాంగం జారీ చేసే సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు.వర్షాల సమయంలో నదులు, వాగులు, చెరువులు, కాలువలు వంటి నీటి ప్రవాహ ప్రాంతాల్లోకి వెళ్లరాదని, వరద నీటిని దాటేందుకు ప్రయత్నించడం ప్రాణాపాయానికి దారితీసే అవకాశం ఉందని హెచ్చరించారు. అలాగే చెట్ల కింద, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, తెగిపోయిన విద్యుత్ తీగల సమీపంలో ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మెరుపులు పడే అవకాశం ఉన్న సమయంలో బహిరంగ ప్రదేశాల్లో గుంపులుగా నిలబడకుండా సురక్షిత భవనాల్లో ఆశ్రయం పొందాలని తెలిపారు. అత్యవసర పరిస్థితులు మినహా బయటకు వెళ్లకుండా ఉండాలని, జారుడు రహదారులపై ప్రయాణించే సమయం లో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. కలుషితమైన ఆహారం, తాగు నీటిని ఉపయోగించకుండా ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు.జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉందని కలెక్టర్ వెల్లడించారు. 24 గంటల పాటు పనిచేసే జిల్లా అత్యవసర నియంత్రణ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, ఎలాంటి విపత్తు పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులతో పాటు ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. ప్రజలు భయాందోళనలకు గురికాకుండా అధికారుల సూచనలను పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని కోరారు.ఆర్అండ్‌బీ శాఖ అధికారులు రహదారుల పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని, పోలీసు శాఖ ట్రాఫిక్ నియంత్రణతో పాటు ప్రజల భద్రతకు చర్యలు చేపట్టాలని, పంచాయతీరాజ్ అధికారులు గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అలాగే గొర్రెల కాపరులు, పశుపోషకులు తమ పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు.అత్యవసర పరిస్థితులు తలెత్తిన వెంటనే గ్రామ, మండల అధికారులకు లేదా జిల్లా నియంత్రణ కేంద్రం 8468220069కు సమాచారం అందించాలని, పోలీసు సహాయం కోసం 100, అగ్నిమాపక శాఖ సహాయం కోసం 101కు సంప్రదించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



## విద్యార్థులకు ప్రమాదం జరిగేదాకా సీసీ రోడ్డుపై మట్టి తొలగించరా..?

**ముత్తారం, జూలై 29 (జనంసాక్షి):** పెద్దపెల్లి జిల్లా ముత్తారం మండలం పారుపల్లి గ్రామంలో సీసీ రోడ్డుపై పేరుకుపోయిన బురద మట్టితో పాఠశాలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతిరోజూ ఇదే రహదారిపై నడుచుకుంటూ వెళ్లాల్సి రావడంతో విద్యార్థులు జారిపడే ప్రమాదం ఉందని గ్రామస్తులు,విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.వర్షాల కారణంగా సీసీ రోడ్డుపై పేరుకుపోయిన మట్టిని తొలగించకపోవడంతో రహదారి ప్రమాదకరంగా మారిందని వారు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు పలుమార్లు దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆరోపించారు.ఏదైనా ప్రమాదం జరిగేలోపు అధికారులు స్పందించి సీసీ రోడ్డుపై ఉన్న బురద మట్టిని వెంటనే తొలగించి విద్యార్థులు, ప్రజలు సురక్షితంగా రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.





## ప్రమాదవశాత్తు ట్రాక్టర్ అదుపు తప్పి వ్యవసాయ రైతు మృతి

**జమ్మికుంట జూలై 29 (జనం సాక్షి):** జమ్మికుంట పట్టణానికి చెందిన ఆరుకాల (భీంపల్లి) కుమారస్వామి వయస్సు 50 అనే రైతు ట్రాక్టర్ అదుపుతప్పి వ్యవసాయ బోల్తా పడగా కుమారస్వామి అక్కడికక్కడే చెందాడు.వివరాల్లోకి వెళితే జమ్మికుంట పట్టణం లోని 7వ వార్డు దుర్గా కాలనీ కి చెందిన రైతు అరుకాల (భీంపల్లి)కుమారస్వామి బుధవారం సొంత



ట్రాక్టర్‌తో వ్యవసాయ పనుల నిమిత్తం తన స్వగ్రామమైన భీంపల్లి కి వెళ్లి పనులు ముగించుకొని తిరిగి వస్తుండగా అంకుశాపూర్, కన్నూర్ గ్రామాల మధ్య ప్రమాదవశాత్తు ట్రాక్టర్ అదుపుతప్పి వ్యవసాయ పొలంలో బోల్తా పడగా ట్రాక్టర్ కింద చిక్కుకున్న కుమారస్వామి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు.ప్రమాదాన్ని గమనించిన స్థానిక రైతులు, గ్రామస్థులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టినా అప్పటికే కుమారస్వామి మృతి చెందినట్లు గుర్తించారు. ఇతనికి భార్య ఇద్దరు కూతుళ్లు ఒక కుమారుడు ఉన్నారు.ఈ వార్త తెలిసి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించగా, గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## ఆధార్ కార్డు లేక సంక్షేమ పథకాలు కోల్పోయిన వ్యక్తి



**గంగాధర జూలై 29 (జనంసాక్షి):** ఆధార్ కార్డు జారీ ప్రక్రియ మొదలైనప్పటి నుండి నేటి వరకు ఆధార్ కార్డు లేకపోవడంతో ఆ వ్యక్తికి రేషన్ కార్డు లేక పింఛన్ రాక ప్రభుత్వం ఇచ్చే ఎన్నో సంక్షేమ పథకాలు కోల్పోయి నష్టపోయిన సంఘటన మండలంలోని ఉప్పరమల్యాల గ్రామంలో చోటుచేసుకుంది వివరాలలోకి వెళితే గ్రామానికి చెందిన అముడగొని చంద్రయ్య అనే వ్యక్తికి ఆధార్ కార్డు తీసుకోవడానికి తన వేలిముద్రలు రాకపోవడంతో ఇప్పటివరకు అతనికి ఆధార్ కార్డు రాలేదు దీంతో ఆయన ఎన్నో సంక్షేమ పథకాలను కోల్పోయి నష్టపోయాడని గుర్తించిన గ్రామానికి చెందిన బిఆర్ఎస్ యువజన నాయకుడు కల్లూరి అనిల్ యాదవ్ తన సొంత ఖర్చులతో చంద్రయ్యను హైదరాబాదు తీసుకువెళ్లి మాదాపూర్ లోని రీజినల్ ఆధార్ కేంద్రంలో ఆధార్ కార్డు అప్లై చేయించాడు కల్లూరి అనిల్ యాదవ్ ను గ్రామస్తులు అభినందించారు.ఆధార్ కార్డు లేక ఇన్ని సంవత్సరాలుగా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు పొందుకోలేక నష్టపోయిన అముడగొని చంద్రయ్యను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సర్పంచ్ సముద్రాల అజయ్ కోరారు.



## భారీ వర్షాలు నిండుకుంటున్న చెరువులు కుంటలు

**మల్యాల జూలై 29 (జనంసాక్షి)** మండల కేంద్రం తో పాటు గ్రామాల్లో రాత్రి భారీగా కురిసిన వర్షాలకు చెరువులు కుంటలు నిండుకున్నాయి,వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు,పలుచోట్ల వర్షానికి నీళ్లు స్తంభించడంతో సర్పంచులు,వార్డ్ సభ్యులు, అధికారులు స్పందించి యుద్ధ ప్రాతిపదిక న సిబ్బందితో నివారణ చర్యలు చేపడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తున్నారు.భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రజా ప్రతినిధులు అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.





## జాగిర్యాల్ గ్రామ సర్పంచ్ అధ్యక్షతన "జలసిరి" గ్రామ సభ నిర్వహణ

**భీంగల్ రూరల్,జులై 29(జనంసాక్షి)** జాగిర్యాల్ గ్రామ సర్పంచ్ గడాల ప్రసాద్ అధ్యక్షతన "జలసిరి" గ్రామ సభ నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గడాల ప్రసాద్ "జలసిరి" కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం,కలిగే ప్రయోజనాలను వివరిస్తూ,వర్షభావం లేని పరిస్థితులలో గ్రామ రైతులకు,ప్రజలకు భూగర్భ జలాలను పెంచి నీటి సమస్యను ఏవిధంగా తీర్చొచ్చు అనే సంబంధిత అంశాలపై అవగాహన కల్పించాలని సంబంధిత గ్రామ అధికారులు,వార్డు సభ్యులు, గ్రామ కమిటీకి,సిబ్బందికి వివరించడం జరిగింది.అలాగే ప్రతి ఇంటికి ఇంకుడు గుంత,బోర్ రీఛార్జ్, తోటలలో కుంటలు నిర్మించాలని గ్రామ సర్పంచ్ ప్రజలను కోరటం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్,వార్డు సభ్యులు,గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు,గ్రామ కమిటీ అధికారులు, సిబ్బంది,అంగన్వాడీలు,ఆశ వర్కర్స్,రైతులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.అలాగే బుధవారం రోజు గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఇంకుడు గుంతకు నిర్మాణం కోసం ముగ్గు పోయడం జరిగింది.

## ధర్మారంలో నేడు పౌరహక్కుల దినోత్సవం

### అంటరానితనం, అస్పృశ్యత నిర్మూలనపై అవగాహన కార్యక్రమం



**శంకరపట్నం జూలై 29 (జనంసాక్షి)** శంకరపట్నం మండలంలోని ధర్మారం గ్రామ ఎస్సీ కాలనీలో గురువారం జూలై 30న పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ సాయి కృష్ణ తెలిపారు. రాజ్యాంగం కల్పించిన సమాన హక్కులపై ప్రజల్లో చైతన్యం పెంపొందించడంతో పాటు అంటరానితనం, అస్పృశ్యత, కుల వివక్ష నిర్మూలనపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.సమాజంలో సమానత్వం, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం వంటి రాజ్యాంగ విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని, కుల వివక్షకు తావులేకుండా సామరస్య వాతావరణాన్ని నెలకొల్పేందుకు ప్రతి పౌరుడు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమానికి సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, దళిత నాయకులు, అంబేద్కర్ వారసులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని డిప్యూటీ తహసీల్దార్ సాయి కృష్ణ కోరారు.

# రూ.60 లక్షల మరమ్మతులు ఏమయ్యాయి..?



దీంతో నిజామాబాద్ నుంచి సిరికొండ మండలానికి రాకపోకలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. సిరికొండ వైపు నుంచి నిజామాబాద్ వెళ్లే వాహనదారులు చిన్న వాల్గొట్ మీదుగా చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో రైతులు పంట పనులకు వెళ్లడం, విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు చేరుకోవడం, అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఆసుపత్రులకు తరలించడం వంటి అంశాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి.

**గ్రామ అభివృద్ధి కమిటీ చొరవ**

ప్రజల ఇబ్బందులను గుర్తించిన కొండూరు గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు ముందుకు వచ్చారు. అక్టోబర్ 14న వాగు మధ్యలో పైపులు ఏర్పాటు చేసి, పాత రహదారికి అనుసంధానం చేస్తూ మొరంతో తాత్కాలిక రహదారిని నిర్మించారు. అయితే అదే నెల 30న వచ్చిన మొంథా తుపాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు ఈ తాత్కాలిక రహదారి కొట్టుకుపోయింది. దీంతో ప్రజలు మళ్లీ రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ప్రజల సమస్యను దృష్టిలో ఉంచుకుని గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు నవంబర్ 5న తిరిగి మొరంతో రహదారిని ఏర్పాటు చేశారు. దీంతో ప్రజల రవాణా భారం కొంత మేర తగ్గింది. అధికారుల కోసం ఎదురుచూడకుండా గ్రామ అభివృద్ధి కమిటీ చేసిన ఈ ప్రయత్నం స్థానికంగా ప్రశంసలు అందుకుంది.

**రూ.60 లక్షల నిధులు.. పనులపై అనుమానాలు**

అనంతరం కొండూరు?సిరికొండ హై లెవెల్ బ్రిడ్జి తాత్కాలిక మరమ్మతుల కోసం రూ.60 లక్షలు విడుదల చేసినట్లు ప్రకటించారు. గత ఏడాది నవంబర్‌లో పనులు ప్రారంభమై, సుమారు మూడు నెలల అనంతరం ఈ ఏడాది జనవరి నుంచి కప్పల వాగు బ్రిడ్జిపై రాకపోకలు పునఃప్రారంభమయ్యాయి.

అయితే కొండూరు గ్రామం వైపు నుంచి బ్రిడ్జిపైకి వెళ్లే అప్రోచ్ రోడ్డు నిర్మాణం పూర్తిస్థాయిలో చేపట్టకుండా వన్ వే మాత్రమే ఏర్పాటు చేశారని అదే ఇప్పుడు కొట్టుకుపోయిందని స్థానికులు చెబుతున్నారు.

బ్రిడ్జి అనుసంధాన రహదారి నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని, వాహనదారుల భద్రతకు అవసరమైన హెచ్చరిక సూచిక బోర్డులు, రక్షణ చర్యలు కూడా సక్రమంగా ఏర్పాటు చేయలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

**మరమ్మతుల నాణ్యతపై ప్రశ్నలు...???**

రూ.60 లక్షలతో చేపట్టిన తాత్కాలిక మరమ్మతు పనులు ఆశించిన స్థాయిలో జరిగాయా? అనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. బ్రిడ్జి పనులు పూర్తయినప్పటికీ, దానికి అనుసంధాన రహదారి పరిస్థితి బలహీనంగా ఉంటే ప్రయోజనం ఏమిటని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు.

ఇప్పటికే వేసవి కాలంలో కురిసిన వడగండ్ల వర్షాలకే బ్రిడ్జి వద్ద వేసిన మొరం పలుచోట్ల కుంగిపోవడం రహదారి నాణ్యతపై అనుమానాలకు తావిచ్చింది.

ప్రమాద పరిస్థితులను గుర్తించిన స్థానిక సర్పంచ్ ముందస్తు జాగ్రత్తగా ప్రమాద సూచికలను ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని గ్రామస్థులు తెలిపారు.

పనుల్లో లోపాలను గుర్తించి సరిదిద్దాల్సిన ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు, సంబంధిత బాధ్యులు స్పందించకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**వర్షాకాలంలో గ్రామాలకు తప్పని తిప్పలు**

ప్రతి వర్షాకాలంలో ఇదే సమస్య పునరావృతం కావడంతో కొండూరు, పెద్ద వాల్గొట్, పోతునూర్, సర్పల్లి తండా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కొండూరు బ్రిడ్జి వద్ద సమస్య ఏర్పడిన ప్రతిసారి సిరికొండ నుంచి నిజామాబాద్ వెళ్లే వాహనదారులు చిన్న వాల్గొట్ మార్గాన్ని ఆశ్రయించాల్సి వస్తోంది. అయితే ఆ మార్గంలోని లో లెవెల్ వంతెనలు కూడా దెబ్బతిన్న కారణంగా ప్రయాణం మరింత ప్రమాదకరంగా మారిందని వాహనదారులు చెబుతున్నారు.

**ముందే హెచ్చరించినా స్పందన లేదా?**

వర్షాకాలం ప్రారంభానికి ముందే కొండూరు బ్రిడ్జి, రహదారి పరిస్థితిపై మండలానికి చెందిన పత్రికా పాత్రికేయులు పలుమార్లు కథనాలు ప్రచురించి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

అయినప్పటికీ ముందస్తు చర్యలు తీసుకోలేదని ప్రజలు అంటున్నారు. ముందుగానే బ్రిడ్జి, రహదారి పరిస్థితిని పరిశీలించి శాశ్వత చర్యలు తీసుకుని ఉంటే ప్రస్తుతం మళ్లీ ఇబ్బందులు ఎదురయ్యేవి కాదని గ్రామస్థులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**ప్రభుత్వాల నిర్లక్ష్యంపై ప్రజల అసంతృప్తి**

స్థానికుల అభిప్రాయం ప్రకారం, గత ప్రభుత్వ హయాంలో సిరికొండ మండలంలోని రహదారులు, వంతెనల అభివృద్ధిపై సరైన దృష్టి సారించలేదని, పలుమార్లు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా శాశ్వత పరిష్కారాలు లభించలేదని పేర్కొంటున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం మారినప్పటికీ మండలంలోని రహదారుల పరిస్థితిలో పెద్దగా మార్పు కనిపించడం లేదని, అదే నిర్లక్ష్య ధోరణి కొనసాగుతోందని వాహనదారులు, గ్రామస్థులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**శాశ్వత పరిష్కారం కోసం ఎదురుచూపులు**

తాత్కాలిక మరమ్మతులతో సమస్యకు పరిష్కారం లభించదని, కొండూరు హై లెవెల్ బ్రిడ్జికి శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

గతంలో విడుదలైన రూ.60 లక్షల నిధుల వినియోగంపై పూర్తి వివరాలు వెల్లడించాలని, పనుల నాణ్యతపై సాంకేతిక పరిశీలన జరపాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇకనైనా ప్రభుత్వం, ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి బ్రిడ్జి, అప్రోచ్ రోడ్డు పనులను పూర్తిస్థాయిలో బలోపేతం చేసి, భవిష్యత్తులో వరదల సమయంలో కూడా రాకపోకలకు అంతరాయం లేకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# విద్యార్థులకు డెస్క్ బెంచీల పంపిణీ చేసిన మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

## ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో లోపాలపై రెవెన్యూ అధికారికి వినతిపత్రం

**భీంగల్ రూరల్, జూలై 29 (జనంసాక్షి):** బాల్కొండ నియోజకవర్గ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి బుధవారం భీంగల్ మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా భీంగల్ పట్టణం, ముచ్కూర్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు డెస్క్ బెంచీలను పంపిణీ చేశారు. వసంత గ్రూప్ ఫౌండర్, మేనేజింగ్ డైరెక్టర్ ఏనుగు దయానంద్ రెడ్డి ఫౌండేషన్ సౌజన్యంతో అందించిన డెస్క్ బెంచీలను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఫౌండేషన్ యాజమాన్యాన్ని వేముల ప్రశాంత్ రెడ్డి అభినందించారు. అనంతరం పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, విద్యా ప్రమాణాలపై ఉపాధ్యాయులు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దోన్కంటి నర్సయ్య,



కౌన్సిలర్ నీలం రవి, ముచ్కూర్ మాజీ ఉపసర్పంచ్ భూమేష్, గ్రామ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. అనంతరం వేముల ప్రశాంత్ రెడ్డి భీంగల్ మండల రెవెన్యూ కార్యాలయాన్ని సందర్శించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఉన్న లోపాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులతో చర్చించారు. బూత్‌ల వారీగా వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి, అర్హులైన ప్రతి ఓటరికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని మండల రెవెన్యూ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# సదాశివనగర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ




**సదాశివనగర్, జూలై 29 (జనంసాక్షి):** కామారెడ్డి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ఎం. రాజేష్ చంద్ర బుధవారం సదాశివనగర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లోని రిసెప్షన్, రైటర్ రూమ్, రికార్డుల నిర్వహణ, సీసీటీఎన్ఎస్ నమోదు, ఇతర విభాగాలను పరిశీలించిన ఆయన అనంతరం పోలీసు అధికారులు, సిబ్బందితో సమావేశమై పలు కీలక సూచనలు చేశారు. పరిశుభ్రమైన పోలీస్ స్టేషన్ సమర్థవంతమైన పోలీసింగ్‌కు పునాదిగా నిలుస్తుందని ఎస్పీ పేర్కొన్నారు. ప్రతి కేసు, ప్రతి పిటిషన్‌ను తప్పనిసరిగా సీసీటీఎన్ఎస్‌లో నమోదు చేసి ఎప్పటికప్పుడు నవీకరించాలని, ఈ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండరాదని ఆదేశించారు. ప్రజాసేవే పోలీసు విధి అనే భావనతో పనిచేస్తూ, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును నిష్పాక్షికంగా విచారించి బాధితులకు సత్వర న్యాయం అందించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా రౌడీషీటర్లు, అనుమానితుల కదలికలపై నిరంతర నిఘా కొనసాగించాలని, గ్రామాలను తరచూ సందర్శించి స్థానిక పరిస్థితులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని వి.పి.ఓలకు సూచించారు. జిల్లా కార్యాలయం నుంచి వచ్చే ఆదేశాలను రోల్‌కాల్‌లో సిబ్బందికి సక్రమంగా తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. పోలీసు సిబ్బంది ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టడంతో పాటు కుటుంబ సభ్యులతో సమయం గడపాలని, పిల్లల్లో మంచి విలువలు, క్రమశిక్షణ పెంపొందేలా తల్లిదండ్రులు ఆదర్శంగా ఉండాలని సూచించారు. జూదం, ఆన్‌లైన్ గేమింగ్ వంటి వ్యసనాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, వ్యక్తిగత క్రమశిక్షణే వృత్తిపరమైన నిబద్ధతకు బలమని అన్నారు.

ఈ తనిఖీలో సదాశివనగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి. సంతోష్ కుమార్, ఎస్ఐ ఎం. పుష్పరాజ్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పెంచికల్‌పేట్ గ్రామ ప్రజలు

# భారీ వర్ష ప్రభావం అప్రమత్తంగా ఉండాలి

## సర్పంచ్ పల్లె మాధవి-నారాయణ సూచన

**పెద్దపల్లి,జూలై 29(జనంసాక్షి) :** భారీ వర్షాల నేపథ్యంలో పెంచికల్‌పేట్ గ్రామ సర్పంచ్ పల్లె మాధవి – నారాయణ గ్రామంలోని లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. వర్షాల కారణంగా అధిక నీటి ప్రవాహంతో ఉద్ధృతంగా ప్రవహిస్తున్న మద్దెల వాగును పరిశీలించి, ప్రజల భద్రత దృష్ట్యా నాయకులు నారాయణ స్వయంగా గ్రామ పంచాయతీ ట్రాక్టర్ నడుపుతూ, వాగుకు ఇరువైపులా రహదారిపై ఎవరూ దాటకుండా ముళ్ల పొదలను అడ్డంగా ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు అవసరం లేకుండా వరద నీరు ప్రవహిస్తున్న ప్రాంతాలకు వెళ్లవద్దని, సూచనలను పాటించాలని పంచాయతీ కార్యదర్శి




ప్రవళిక కోరారు. ప్రజల ప్రాణ భద్రతే అత్యంత ముఖ్యమని పేర్కొంటూ, పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చే వరకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ విజ్ఞప్తి చేశారు..

# చినుకు పడితే చిత్తడే

- 26 వార్డులో అధ్వానంగా రోడ్ల పరిస్థితి..
- మున్సిపల్ కమిషనర్ మరమ్మత్తులు చేయించాలి..



**ఆర్మూర్, జూలై 29 (జనంసాక్షి):** కురిసింది మోస్తరు వానే..వర్షపు నీరు నిలిచిపోయి బురదమయంగా చినుకు పడితే చిత్తడే అనేలా మారింది.ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని 26వ వార్డు రాజారాం నగర్ కాలనీలో గల సులేమాన్ నఫీసా మజీద్ వెనుక లో గల వీధి రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది.సరైన డ్రైనేజీ వ్యవస్థ లేనందున వర్షపు నీరు రోడ్డుపై నిలిచి ప్రధాన సమస్యగా ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.స్కూల్ పిల్లలు,పాదచారులు, ద్విచక్ర వాహనదారులకు ఇదే వీధి గత్యంతరం కావడంతో ఇబ్బందుల పాలవుతున్నారు.ఇళ్లల్లోని ప్రజలు వీధుల్లోకి రావాలంటేనే ఎక్కడ కాలు జారి పడి పోతామోనని వణికిపోతున్నారు.ప్రధానంగా చిన్న పిల్లలు,వృద్ధులు నానా తంటాలు పడుతున్నారు.కనీసం మున్సిపల్ అధికారులు,అధికార ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదని విమర్శల పాలవుతున్నారు. ఇకనైనా మున్సిపల్ కమిషనర్ మరమ్మత్తులు చేయించి శాశ్వత పరిష్కారం చూపాలని వార్డు ప్రజలు కోరుతున్నారు.

# ఐఐటీ నుండి బీటెక్ పట్టా ఈఐఎల్‌లో ఉద్యోగం



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 29 జనంసాక్షి :** ప్రాంతీయ చెరుకు వరి పరిశోధన కేంద్రం రుద్రూర్ విభాగాధిపతి వ్యవసాయ పాలిటెక్నిక్ రుద్రూర్ ప్రిన్సిపాల్ జిల్లా వాసి డాక్టర్ కే పవన్ చంద్రారెడ్డి కుమారుడు కే జయ చంద్రారెడ్డి ప్రతిష్టాత్మకమైన భారతీయ సాంకేతిక విజ్ఞాన సంస్థ హైదరాబాద్, కంది, సంగారెడ్డి ప్రాంగణంలో ఇటీవల జరిగిన ఐఐటి హైదరాబాద్ 15వ స్నాతకోత్సవములో పద్మ విభూషణ్ గ్రహీత స్నాతకోత్సవ ముఖ్య అతిథి పద్మా సుబ్రహ్మణ్యం, ఐఐటి హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ బి.ఎస్ మూర్తి చేతులమీదుగా మెకానికల్ ఏరోస్పేస్ ఇంజనీరింగ్ బ్రాంచ్లో బీటెక్ పట్టాను అందుకున్నారు. జయచంద్ర తన ప్రాథమిక విద్యను వర్నిలో మాట్రిక్స్ హైస్కూల్లో ప్రారంభించి రెండు నుండి 5వ తరగతి వరకు నిజామాబాద్ లోని ఎస్సార్ డి జీ స్కూల్లో 6 నుండి 8వ తరగతి వరకు ముబారక్ నగర్ లోని ఆర్ బి వి ఆర్ ఆర్ హై స్కూల్లో 9,10 వ తరగతి వరకు హైదరాబాద్ హైదర్గూడా లోని శ్రీ చైతన్య పాఠశాలలో విద్యను అభ్యసించారు. అనంతరం 2020 -22 వరకు హైదరాబాద్ లోని ఎస్సార్ నగర్ లో శ్రీ చైతన్య జూనియర్ కళాశాల లో ఎంపీసీ విభాగంలో ఇంటర్మీడియట్ విద్యను అభ్యర్థించారు. అనంతరం ఐఐటి ఎన్ఐటీలలో ప్రవేశాల కొరకు జాతీయస్థాయిలో నిర్వహించే జేఈఈ అడ్వాన్స్ 2022 పరీక్షలో మెరుగైన ర్యాంకు రావడంతో కంది సంగారెడ్డి లోని ఐఐటి హైదరాబాదులో మెకానికల్, ఏరోస్పేస్ విభాగంలో సీటు సంపాదించారు. 2026 మే నెలలో మెకానికల్ విభాగంలో మెరుగైన సి జి పి ఏ 9.11 తో తన బీటెక్ డిగ్రీ ని పూర్తి చేసుకోవడం జరిగింది. క్యారియర్ టెక్నాలజీ ఇండియా లిమిటెడ్ హైదరాబాద్ లో ఇంటర్న్ షిప్ పూర్తి చేశాడు. ఐఐటి హైదరాబాద్లో జరిగే ప్రాంగణ నియామకాలలో దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన నవరత్న సంస్థలలో ఒకటైన ఇంజనీర్స్ ఇండియా లిమిటెడ్ గురుగ్రాం న్యూఢిల్లీలో మెకానికల్ ఇంజనీర్గా ఉద్యోగం సంపాదించాడు. జయచంద్ర ప్రతిష్టాత్మకమైన ఐఐటి హైదరాబాద్ నుండి బీటెక్ పట్టా పొంది కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలలో ప్రతిష్టాత్మకమైన నవరత్న కంపెనీలలో ఒకటైన ఈఐఎల్ లో ఉద్యోగం సంపాదించడం పట్ల కుటుంబ సభ్యులు, జయచంద్ర విద్యను అభ్యసించిన పాఠశాల కళాశాలల యాజమాన్యం, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## తెలంగాణ జలసిరి గ్రామసభ ప్రత్యేక సమావేశం నిర్వహణ

**ఇందల్వాయి ( జనం సాక్షి)**

ఇందల్వాయి, జూలై 29: ఇందల్వాయి మండల కేంద్రంలోని గంగారం తండా గ్రామపంచాయతీ పరిధిలో తెలంగాణ జలసిరి కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సంగీత దిలీప్ మాట్లాడుతూ, ప్రభుత్వం చేపట్టిన జలసిరి కార్యక్రమం గ్రామాల్లో భూగర్భ జలాలను పెంపొందించేందుకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు.ఇంకుడు గుంతలు, పంట కుంటలు, బోరు రీఛార్జ్ వంటి కార్యక్రమాల ద్వారా భూగర్భ జలాలు పెరిగి, రైతులకు నీటి కొరత సమస్య తగ్గుతుందని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం నీటి లభ్యత లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని తీసుకొచ్చిన ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ స్వాగతించి విజయవంతం చేయాలని కోరారు. గ్రామ ప్రజలు, రైతులు గ్రామపంచాయతీకి పూర్తి సహకారం అందించి, ప్రభుత్వం సూచించిన జల సంరక్షణ చర్యలను అమలు చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. గ్రామసభలో గ్రామ సర్పంచ్ సంగీత దిలీప్. ఉప సర్పంచ్ ధూమ. వార్డ్ మెంబర్ బుజ్జీ ముస్లిం మైనార్టీ అధ్యక్షులు కాజా పాషా. మాజీ ఉపసర్పంచ్ తాజుద్దీన్. అంగన్వాడీ టీచర్ శారద. ఆశ వర్కర్ జ్యోతి. వివో ఏ. అబ్బు పంచాయతీ సెక్రటరీ సుధాకర్. కారోబార్ శీను.అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామస్థులు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయడానికి తమ సహకారం అందిస్తామని తెలిపారు.

## మెండోర గ్రామానికి చెందిన అల్లెపు నర్సయ్య వైద్యానికి 2,50,000 రూపాయల యల్.ఓ.సి సహాయం



**భీంగల్ రూరల్,జులై 29 (జనం సాక్షి)**

ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ సహాయం.మెండోర గ్రామానికి చెందిన అల్లేపు నర్సయ్య ఇటీవల వెన్నెముక నరాల నొప్పికి సంబంధించి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స నిమిత్తం హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రిలో చేరారు.అక్కడ అతనిని పరీక్షించిన వైద్యులు వెన్నెముకకు శస్త్రచికిత్స చేయాలని సూచించగ,ఈ విషయాన్ని తెలుసుకున్న మెండోర గ్రామ కాంగ్రెస్ నాయకత్వం, బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ ను సంప్రదించి గ్రామానికి చెందిన అల్లెపు నర్సయ్య పరిస్థితిని వివరిస్తు,ప్రభుత్వం తరపున సహాయం అందించాలని కోరారు.వారి విజ్ఞప్తికి వెంటనే స్పందించిన కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గం ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్, ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి అల్లెపు నర్సయ్య శస్త్రచికిత్స కోసం 2,50,000/- రూపాయల యల్.ఓ.సి గ్రామ కాంగ్రెస్ నాయకత్వానికి అందించగా,ఈ చెక్కును సంబంధిత అధికారుల ద్వారా బాధితునికి చేరవేయడం జరిగింది. సకాలంలో స్పందించి బాధిత కుటుంబాన్ని ఆదుకున్నందుకు గ్రామ కాంగ్రెస్ నాయకత్వం,బాధిత కుటుంబం, ముత్యాల సునీల్ కుమార్ కి కృతజ్ఞతలు తెలియచేశారు.

# ఎల్లారెడ్డిలో 100 శాతం పూర్తైన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ

**బూత్ స్థాయి ప్రతినిధుల సేవలు ప్రశంసనీయం**
**ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్**



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, జూలై 29 (జనంసాక్షి):** కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను 100 శాతం విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా బుధవారం ఎల్లారెడ్డి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించిన బూత్ స్థాయి ప్రతినిధులను (బీఎల్ఏలు) వారు ప్రత్యేకంగా అభినందించారు. అర్హులైన ప్రతి ఓటరు వివరాలు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా బీఎల్ఏలు బాధ్యతాయుతంగా పనిచేయడం వల్లే ఈ ప్రక్రియ విజయవంతంగా పూర్తైందని కొనియాడారు.ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో ఖచ్చితమైన ఓటరు జాబితా కీలకమని పేర్కొన్న నాయకులు, ఎన్నికల ప్రక్రియలో నిబద్ధతతో విధులు నిర్వహించిన ప్రతి బీఎల్ఏకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదే సేవా స్ఫూర్తితో భవిష్యత్తులో కూడా ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు.ఈ సమావేశంలో జహీరాబాద్ పార్లమెంట్ ఎస్ఐఆర్ కోఆర్డినేటర్ ధనలక్ష్మి, నియోజకవర్గ ఎస్ఐఆర్ కోఆర్డినేటర్ యాదయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కోఆర్డినేటర్లు, బూత్ స్థాయి ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చలో బస్సు భవన్ ముట్టడి విజయవంతం చేయండి

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 29: జనంసాక్షి**

ఆర్టీసీ సంస్థలో పనిచేసి పదవి విరమణ పొందిన ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 4వ తేదీన బస్ భవన్ ముట్టడి కార్యక్రమాన్ని చేపడుతున్నామని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆనందం వెల్లడించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ సమస్యలు 2013 నుండి పెండింగ్లో ఉన్నాయని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన మా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని వాపోయారు. తెలంగాణ ఉద్యమ సాధనలో ఆర్టీసీ ఉద్యోగులు చురుకుగా పాల్గొని అనేకమంది చనిపోయారన్నారు. బతుకున్నప్పుడే రావాల్సిన బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.ఒక్కొక్కరికి పది నుండి పదిహేను లక్షల వరకు బకాయిలు రావాల్సి ఉందన్నారు. ఆగస్టు మూడవ తేదీ వరకు తమ సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా 17వేల మంది విశ్రాంత ఉద్యోగులు బస్ భవన్ ముట్టడిస్తామని హెచ్చరించారు.జిల్లా అధ్యక్షులు రాజన్న మాట్లాడుతూ మా సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రంలోని వివిధ జిల్లాలలో ఎంపీలను, ఎమ్మెల్యేలను కలిసి వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు. సంస్థలో పనిచేసి చనిపోయిన వారి కుటుంబాలకు అండగా నిలవాలని ప్రభుత్వాన్ని కోరూతున్నామ్మన్నారు. స్టేట్ జనరల్ సెక్రెటరీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సంస్థలో సుదీర్ఘకాలం సేవలందించి పదవీ విరమణ పొందిన తర్వాత అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామన్నారు. వేతన సవరణ జరిగిన ఇప్పటివరకు డబ్బులు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షులు పి రామచందర్, కార్యదర్శి ఎస్ పోశెట్టి, కోశాధికారి సుదర్శన్ గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్ఎల్ నారాయణ, డి ఎస్ బి రాజు, జీవి చారి, ఆర్. నర్సింలు, జిల్లాలోని అన్ని డిపోల అధ్యక్షా కార్యదర్శులు పాల్గొన్నారు.



# స్నేహితుడి ఇంట్లోనే రూ.26 లక్షల చోరీ..

## కేసు ఛేదించిన కరీంనగర్ రూరల్ పోలీసులు

**కరీంనగర్ రూరల్, జూలై 29, ( జనం సాక్షి)**

కరీంనగర్ రూరల్ పోలీసులు భారీ ఇంటి చోరీ కేసును విజయవంతంగా ఛేదించి ప్రధాన నిందితుడు తగరం శంకర్ లాల్‌ను అరెస్టు చేశారు. నిందితుడు తన చిన్ననాటి స్నేహితుడు, ఫిర్యాదు దారుడైన గుడిమల్ల శ్రీనివాస్ ఇంట్లో దాచిన రూ.26 లక్షల నగదును అపహరించినట్లు దర్యాప్తు లో వెల్లడైంది. ఈ కేసులో మరో నిందితురాలు అడెపు రేష్మ ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.పోలీసుల కథనం ప్రకారం, ఫిర్యాదు దారుడు ఇటీవల వ్యవసాయ భూమి విక్రయించడం తో పెద్ద మొత్తంలో నగదు ఇంట్లో ఉంచిన విషయం నిందితుడికి ముందే తెలుసు. గతంలో ఆ ఇంటికి వెళ్లిన అనుభవంతో ఇంటి నిర్మాణం, అదనపు తాళం ఉంచే ప్రదేశంపై అవగాహన ఉండటంతో చోరీకి పథకం రచించాడు. జూన్ నెలలో రేష్మతో కలిసి ఇంటికి వెళ్లి ప్రధాన ద్వారం, బాత్‌రూమ్ తాళాలు పగులగొట్టి ఇంట్లో వెతకగా ప్లాస్టిక్ డ్రమ్ లో దాచిన అట్టపెట్టెలో ఉన్న రూ.26 లక్షల నగదు ను అపహరించినట్లు పోలీసులు వెల్లడించారు. దర్యాప్తు సందర్భంగా సీసీటీవీ దృశ్యాలు, సాంకేతిక ఆధారాలు, ఇతర శాస్త్రీయ సాక్ష్యాల ఆధారంగా నిందితుడిని గుర్తించిన పోలీసులు బుధవారం బొమ్మకల్ బస్‌స్టాప్ సమీపంలో వాహనాల తనిఖీల సమయంలో అదుపులోకి తీసుకున్నారు. విచారణ లో నిందితుడు నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి రూ.17.60 లక్షల నగదు, చోరీకి ఉపయోగించిన స్విఫ్ట్ కారు, ఒక శాంసంగ్ మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన నగదును ఇతరులకు ఇచ్చినట్లు నిందితుడు చెప్పి



నప్పటికీ, పూర్తి వివరాలు వెల్లడించలేదని పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న రెండో నిందితురాలి కోసం గాలింపు కొనసాగుతోంది.పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఆదేశాల మేరకు, రూరల్ ఏసీపీ విజయ్ కుమార్ పర్యవేక్షణలో రూరల్ ఇన్స్పెక్టర్ ఎ. నిరంజన్ రెడ్డి, ఎస్ఐ ఎ. లక్ష్మారెడ్డి మరియు వారి బృందం కేసును ఛేదించగా, కమిషనర్ పోలీసు బృందాన్ని అభినందించారు. ప్రజలు అధిక మొత్తంలో నగదు, విలువైన ఆభరణాలను ఇళ్లలో కాకుండా బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలని పోలీసులు సూచించారు.



# సాధన స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో మాక్ ఎన్నికలు, ఘనంగా ఇన్వెస్టిచర్ వేడుకలు

**కరీంనగర్ టౌన్, జూలై 29, ( జనం సాక్షి)**

జ్యోతి నగర్‌లోని సాధన స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడం, ప్రజాస్వామ్య విలువలపై అవగాహన కల్పించే లక్ష్యంతో విద్యార్థి మంత్రి మండలి మాక్ ఎన్నికలు, అనంతరం ఇన్వెస్టిచర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎన్నికలను పూర్తిగా బ్యాలెట్ విధానంలో నిర్వహించడం విశేషంగా నిలిచింది.పాఠశాల చైర్మన్ డా. సి.హెచ్. శ్రీనివాసరావు నమూనా ఓటు వేసి ఎన్నికల ప్రక్రియను ప్రారంభించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల నిర్వహణలో విద్యార్థులే బూత్ అధికారులు, ఎన్నికల అధికారులు, ప్రిసైడింగ్ అధికారులుగా వ్యవహరించి, ఓట్ల లెక్కింపును కూడా పారదర్శకంగా నిర్వహించారు.ఎన్నికల్లో హెడ్ బాయ్‌గా శ్రీ ఆన్స్ తేజ్, హెడ్ గర్ల్‌గా కే. అక్షర ఎన్నికయ్యారు. బాయ్స్ స్పోర్ట్స్ క్యాప్టెన్‌గా ఎన్. శ్రీ వర్షిత్, గర్ల్స్ స్పోర్ట్స్ క్యాప్టెన్‌గా జి. పవనసుత ఎంపికయ్యారు. అలాగే నాలుగు హౌస్‌లకు కెప్టెన్లను ఎన్నుకుని, క్రమశిక్షణ, సాంస్కృతిక విభాగాలకు కూడా విద్యార్థి నాయకత్వ బాధ్యతలు అప్పగించారు.ఎన్నికల అనంతరం నిర్వహించిన ఇన్వెస్టిచర్ కార్యక్రమంలో విజేతలకు శాష్‌లు, క్యాప్‌లు, బ్యాడ్జ్‌లు, సర్టిఫికెట్లు అందజేసి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా చైర్మన్ డా. సి.హెచ్. శ్రీనివాసరావు మాట్లాడుతూ, విద్యార్థుల్లో నాయకత్వ నైపుణ్యాలను పెంపొందించడమే కాకుండా ఓటు విలువ, ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన కల్పించేందుకు ఈ ఎన్నికలు నిర్వహించినట్లు తెలిపారు. నేటి విద్యార్థులే రేపటి బాధ్యతాయుత పౌరులుగా, దేశానికి సమర్థ నాయకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రిన్సిపల్ వి. కుమార స్వామి, ప్రైమరీ ప్రిన్సిపల్ ఆర్. ధనలక్ష్మి, పీఈటీ జి. నరేందర్, ఉపాధ్యాయులు, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆకస్మికంగా కామారెడ్డిలో పర్యటించిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు

## సీజనల్ వ్యాధుల నియంత్రణకు అప్రమత్తంగా ఉండాలని అధికారులకు డా. రవీందర్ నాయక్ ఆదేశాలు

**కామారెడ్డి, జూలై 29 (జనంసాక్షి):**

రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల నియంత్రణ చర్యలు, ఆరోగ్య శాఖ సంసిద్ధతతో పాటు వివిధ ఆరోగ్య కార్యక్రమాల అమలును సమీక్షించేందుకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ సంచాలకులు డా. రవీందర్ నాయక్ బుధవారం కామారెడ్డి జిల్లాలో ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా భిక్నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఆయన, అక్కడ రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో నేరుగా మాట్లాడి వైద్య సేవల నాణ్యతపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేసిన ఆయన, వైద్యాధికారి డా. ఏమిమా పనితీరును ప్రత్యేకంగా అభినందించారు.అనంతరం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో ప్రోగ్రాం అధికారులతో పాటు జిల్లాలోని అన్ని వైద్యాధికారులతో జూమ్ సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నివారణకు చేపట్టాల్సిన ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక, ముందస్తు జాగ్రత్తలు, క్షేత్రస్థాయిలో వైద్య సేవల బలోపేతం, వ్యాధుల పర్యవేక్షణ, ప్రజల్లో అవగాహన కార్యక్రమాల నిర్వహణ వంటి అంశాలపై సమగ్రంగా సమీక్ష



నిర్వహించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు సీజనల్ వ్యాధులను సమర్థవంతంగా నియంత్రించేందుకు ప్రతి ఆరోగ్య సంస్థ అప్రమత్తంగా పనిచేయాలని డా. రవీందర్ నాయక్ సూచించారు. అవసరమైన మందులు, వైద్య సిబ్బంది, ఇతర వసతులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. వెంకటి, ప్రోగ్రాం అధికారులు డా. రాజు, డా. వెంకటస్వామి, డా. రోహిత్, డా. ప్రదీప్, డా. నర్సింగ్ చౌహాన్, ఏఎంఓ శ్రీనివాస్ రెడ్డి, డెమో మహేందర్ రెడ్డి, హెచ్.ఈ. వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# కాచాపూర్‌లో పారిశుద్ధ్య సిబ్బందికి రైన్‌కోట్లు పంపిణీ

శంకరపట్నం జూలై 29 జనం సాక్షి

శంకరపట్నం మండలంలోని కాచాపూర్ గ్రామంలో వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామపంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందికి రైన్‌కోట్లు, శానిటేషన్ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. మండల పంచాయతీ అధికారి ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ ఊకంటి మాధవి మధుకర్ సిబ్బందికి రైన్‌కోట్లు, అవసరమైన పారిశుద్ధ్య సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ పరిశుభ్రతను కాపాడడంలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎంతో కీలకమని అన్నారు. వర్షాకాలంలోనూ వారు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విధులు నిర్వర్తించేందుకు రక్షణ సామగ్రిని అందజేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ ప్రజారోగ్య పరిరక్షణకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.మండల పంచాయతీ అధికారి ప్రభాకర్ మాట్లాడుతూ పారిశుద్ధ్య సిబ్బంది తమ విధులను నిబద్ధతతో నిర్వహించాలని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజల సహకారం కూడా అవసరమని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి సంపత్, గ్రామపంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.



# భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు

- ప్రాంతాల్లో మేయర్ శ్రీనివాస్ క్షేత్రస్థాయి పరిశీలన
- డ్రైనేజీ, వరద నీటి పారుదల పనులను వేగవంతం చేయాలి..
- అధికారులకు మేయర్ ఆదేశాలు

**కరీంనగర్ బ్యూరో, జులై 29 (జనంసాక్షి) :**

కరీంనగర్ నగరంలో బుధవారం రోజు కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో టూ టౌన్ సమీపంలోని నాలా, మంచిర్యాల్ చౌరస్తా నాలా, వి-పార్క్ సమీపంలోని నాలాతో పాటు నగరంలోని పలు లోతట్టు ప్రాంతాలను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ బుధవారం రోజు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా స్మార్ట్ సిటీ ప్రాజెక్టు కింద చేపట్టిన డ్రైనేజీ, వరద నీటి పారుదల పనుల పురోగతిని సమీక్షించిన మేయర్, పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. వర్షపు నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా తక్షణ చర్యలు చేపట్టాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా శాశ్వత పరిష్కారాల దిశగా అధికారులు పనిచేయాలని సూచించారు. నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి అత్యవసర చర్యలు తీసుకోవాలని, అవసరమైతే అదనపు యంత్రాంగాన్ని వినియోగించి నీటి పారుదల వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపల్ యంత్రాంగం, డీఆర్ఎఫ్ బలగాలు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. భారీ వర్షాలు మరో రెండు రోజుల పాటు కొనసాగే అవకాశం ఉన్నందున నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మేయర్ విజ్ఞప్తి చేశారు. శిథిలావస్థలో ఉన్న పాత మట్టి ఇళ్లలో నివసిస్తున్న వారు తమ భద్రత దృష్ట్యా వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. బుధవారం రోజు 43వ డివిజన్‌లో గోడ కూలి పక్కన ఇంటి పై పడిపోగా గోడను జేసీబీ సహాయంతో పూర్తిగా తొలగించి ప్రమాదాన్ని నివారించినట్లు తెలిపారు. నగరంలోని ఇతర ప్రమాదకర భవనాలు, గోడలను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపల్ అధికారులు, సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా పనిచేయాలని మేయర్ ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో నగర ప్రజలు వెంటనే మున్సిపల్ కాల్ సెంటర్ నంబర్ 98499 06694 లేదా తమ సంబంధిత డివిజన్ కార్పొరేటర్‌ను సంప్రదించాలని సూచించారు. అందిన ప్రతి ఫిర్యాదు పై వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక బృందాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, కార్పొరేటర్లు పదాల శ్రీజ అజయ్, పొన్నం లక్ష్మీ మొండయ్య, నునావత్ భాస్కర్ నాయక్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



## నైపుణ్యాభివృద్ధి కోర్సుల శిక్షకురాళ్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

రామగిరి జనం సాక్షి జూలై 29: 2026-27 ఆర్థిక సంవత్సరానికి రామగుండం?3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాల్లో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న నైపుణ్యాభివృద్ధి కోర్సులకు శిక్షకురాళ్లుగా సేవలందించేందుకు అర్హత, అనుభవం కలిగిన మహిళల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రామగుండం?3 ఏరియా పర్సనల్ విభాగాధిపతి బి. సుదర్శనం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.టైలరింగ్, మగ్గం వర్క్, స్పోకెన్ ఇంగ్లీష్, జూట్ బ్యాగ్స్



తయారీ తదితర కోర్సులకు శిక్షణ అందించేందుకు ఆసక్తి ఉన్న సింగరేణి ఉద్యోగుల కుటుంబ మహిళలు, పరిసర గ్రామాల మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.దరఖాస్తుతో పాటు సంబంధిత విభాగంలో అనుభవ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, విద్యార్హత ధ్రువీకరణ పత్రాల ప్రతులను జత చేసి రామగుండం?3 ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలోని పర్సనల్ విభాగానికి ఆగస్టు 10, 2026 సాయంత్రం 5 గంటలలోపు సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం రామగుండం?3 ఏరియా పర్సనల్ విభాగాన్ని సంప్రదించాలని కోరారు.



## మండల స్థాయి సమావేశంలో ప్రశ్నల వర్షం

ముస్తాబాద్ జులై 29 (జనం సాక్షి)
ముస్తాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ లాచ్చాలు ఆధ్వర్యములో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లా అధికారి బాలమిత్ర ప్రైవేట్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని మండల ఏంఇఓను ప్రశ్నించగా పాఠశాల యాజమాన్యం పై త్వరలో చర్యలు తీసుకుంటామని మండల ఎంఈఓ తెలిపారు.అంతే కాకుండా మండలములో ప్రైవేట్ స్కూల్ యజమాన్యం బుక్ లను అధిక ధరలకు విక్రయిస్తున్న బుక్ స్టాల్ ల పై చర్యలు తీసుకుంటామని అన్నారు. మండలములోని ఆయా గ్రామాల్లో గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా ప్రతి గ్రామములో హరిత హర మొక్కలు నాటాలని అధికారులకు సూచించారు.అదే విధంగా వైకుంఠ ధామలు లేని గ్రామాల్లో వైకుంఠ ధామాలు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నీటి వసతిని కల్పించి రోడ్డుకు ఇరువైపులా వున్న కొమ్మలను ప్రయాణికులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకోవాలని గ్రామ సర్పంచ్ ఆంజనేయులు అన్నారు.సిరిసిల్ల,సిద్దిపేట డిపో ల నుండి వచ్చే బస్ లు గూడూరు గ్రామానికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని గ్రామ సర్పంచ్ చిటీ సునీత కోరారు.మండలములో మిషన్ భగీరథ నీటిలో కలుషిత నీరు వస్తుందని, అంతే కాకుండా పైప్ లైన్ ద్వారా తక్కువ నీరు వస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమములో జిల్లా ప్రత్యేక అధికారి వెంకట మాధవ రావు,మండల ప్రత్యేక అధికారి నిర్మల,మిషన్ భగీరథ డీఈ పావని,జిల్లా ఆత్మ చైర్మన్ కొండం రాజిరెడ్డి,సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి రాణి,మండల తహశీల్దార్ మహమ్మద్ అబ్దుల్ ఫారూఖ్,ఎంపీవో వాజిద్,సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షులు చిగురు నరేష్,వివిధ గ్రామాల సర్పంచ్లు,అధికారులు పాల్గొన్నారు.

## వర్షాల వేళ ప్రజలకు అండగా..!

**నీళ్లలోకి దిగి చెత్త తొలగించిన ఉపసర్పంచ్ కొత్తపల్లి సతీష్**

కమాన్‌పూర్, జూలై 29, (జనంసాక్షి) : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయు గుండం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండలం సిద్ధిపల్లె గ్రామపంచాయతీ పరిధిలోని ప్రధాన రహదారిపై వర్షపు నీరు ప్రవహించి రాకపోక లకు అంతరాయం ఏర్పడింది. రహదారి పక్కన ఉన్న కాలువ మత్తడి పైపులైన్లు



చెత్తతో మూసుకుపోవడంతో వర్షపు నీరు బయటకు వెళ్లక రోడ్డుపైకి చేరింది. విషయం తెలుసుకున్న వెంటనే గ్రామ సర్పంచ్ బంగారు కళ్యాణి?మహేష్, ఉపసర్పంచ్ కొత్తపల్లి సతీష్, పంచాయతీ కార్యదర్శి జంజర్ల అమల సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ కొత్తపల్లి సతీష్ స్వయంగా వర్షపు నీటిలోకి దిగి పైపులైన్లలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. దీంతో నీటి ప్రవాహం సజావుగా కొనసాగి రహదారిపై నిలిచిన నీరు తగ్గడంతో వాహనదారులు, గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

### భారీ వర్షాల నేపథ్యంలో భవన నిర్మాణ కార్మికులు

# అప్రమత్తంగా ఉండాలి

○ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు చిలువేరు స్వామి

మంథని, జూలై 29, (జనంసాక్షి) : రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో భవన నిర్మాణ కార్మికులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని భవన నిర్మాణ కార్మిక సమైక్య సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు చిలువేరు స్వామి సూచించారు. భారీ వర్షాల కారణంగా నిర్మాణ స్థలాల్లో ప్రమాదాలు జరిగే అవకాశం



ఎక్కువగా ఉంటుందని, కార్మికులు భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆయన అన్నారు. ముఖ్యంగా వర్షాలకు తడిసి బలహీనపడిన పాత గోడలు, శిథిలావస్థలో ఉన్న నిర్మాణాల వద్ద పనులు చేయవద్దని సూచించారు. అలాంటి గోడలు ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదం ఉండడంతో కార్మికులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. అదేవిధంగా ఎత్తైన భవనాలపై పనిచేసే సమయంలో తప్పనిసరిగా రక్షణ పరికరాలు ధరించాలని, విద్యుత్ తీగలు, నీటితో నిండిన గుంతలు, జారుడు ప్రదేశాల వద్ద ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితులు మినహా భారీ వర్షాల సమయంలో పనులకు దూరంగా ఉండాలని, కార్మికుల ప్రాణ భద్రతే అత్యంత ముఖ్యమని అన్నారు. గృహ నిర్మాణ యజమానులు కూడా కార్మికుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ అవసరమైన అన్ని భద్రతా చర్యలు చేపట్టాలని చిలువేరు స్వామి కోరారు.

## ప్రభుత్వ పాఠశాలలోకి వరద నీరు..,

# విద్యార్థులకు సెలవు

**రామగిరి జనం సాక్షి రామగిరి, జూలై 29:**
భారీ వర్షాల కారణంగా రామగిరి మండలం రత్నాపూర్ ప్రభుత్వ పాఠశాలలోకి బుధవారం వరద నీరు భారీగా చేరింది. సమీపంలోని నాలా పొంగిపొర్లడంతో వరద నీరు పాఠశాల ఆవరణలోకి ప్రవహించి విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సెంటినరీ కాలనీ, రామ్‌నగర్, లద్నాపూర్ పాత, కొత్త ప్లాట్లు, అలాగే రామగిరి ఖిల్లా ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు ఈ నాలా గుండా ప్రవహించడంతో ఈ పరిస్థితి ఏర్పడినట్లు స్థానికులు తెలిపారు.సమాచారం అందుకున్న స్థానిక సర్పంచ్ పల్లె ప్రతిమ-పీవీ రావు, గ్రామ సెక్రటరీ గంగుల సంతోష్ వెంటనే పాఠశాలకు చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా పాఠశాలకు ఒక రోజు సెలవు ప్రకటించినట్లు అధికారులు తెలిపారు.ప్రతి ఏడాది వర్షాకాలంలో ఇదే సమస్య ఎదురవుతోందని, నాలా విస్తరణతో పాటు శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని గ్రామస్తులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.




# ఖరీఫ్ సాగుకు భరోసా ఇచ్చిన వానలు..

○ రైతుల్లో వెల్లు విరిసిన ఆనందం..! ○ పెద్దపల్లి జిల్లాలో కుండపోత వర్షం

○ కమాన్ పూర్, అంతర్గాం మండలాల్లో అధిక వర్షపాతం, 3 మండలాల్లో లోటు

మంథని, జూలై 29, (జనంసాక్షి) : ఎలినో ప్రభావంతో ఈ వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు గడిచిన ఆశించిన వర్షాలు పడకపోవడంతో రైతన్నలు తీవ్ర ఆందోళన చెందుతున్న తరుణంలో బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు ఖరీఫ్ సాగుకు భరోసా ఇచ్చాయని చెప్ప వచ్చు. పెద్దపల్లి జిల్లాలో మంగళవారం భారీ వర్షాలు కురిశాయి. ముసురుతో కూడ న వర్షానికి ప్రజలు, ముఖ్యంగా రైతుల ముఖాల్లో ఆనందం వెలువెరిసింది. నేటి వర్షపాతం అన్ని మండలాల్లోనూ సాధారణం కంటే అధికంగా నమోదైన ప్పటికీ, సంచిత వర్షపాతంలో మాత్రం 3 మండలాలు ఇంకా లోటును ఎదుర్కొంటు న్నాయి. వాతావరణ శాఖ అధికారులు విడుదల చేసిన గణాంకాల ప్రకారం జిల్లా సగటు వర్షపాతం 84.0 మి.మీగా నమోదైంది. ఇది సాధారణ వర్షపాతం 6.8 మి.మీ కంటే 1135 శాతం అధికం.



**ఎక్కడ ఎంత వర్షం పడిందం..?**

జిల్లాలో అత్యధికంగా కమాన్ పూర్ మండలంలో 141.4 మి.మీ వర్షం కురవగా, అత్యల్పంగా సుల్తానాబాద్‌లో 42.5 మి.మీ నమోదైంది. రామగుండం 129.3 మి.మీ, పాలకుర్తి 117.4 మి.మీ, రామగిరి 108.0 మి.మీ, అంతర్గాం 101.2 మి.మీ వర్షపాతం నమోదు చేశాయి. మండలాల వారీగా చూస్తే.. కమాన్‌పూర్, అంతర్గాం అధిక వర్షపాతం నమోదు కాగా..ధర్మారం, పాలకుర్తి, రామగుండం, రామగిరి, పెద్దపల్లి, ఓదెల, శ్రీరాంపూర్, ముత్తారం-మంథని, మంథని మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదయింది. జులపల్లి -36 శాతం, ఎల్లయిడ్ -37 శాతం, సుల్తానాబాద్ -32 శాతం లోటు వర్షపాతం నమోదు అయింది. ఎలిగేడు, జులపల్లి, సుల్తానాబాద్ మండలాల్లో వర్షాలు ఇంకా ఆశించిన స్థాయిలో పడలేదని అధికారులు తెలిపారు. వచ్చే రోజుల్లోనూ వర్షాలు కొనసాగే అవకాశం ఉన్నందున రైతులు విత్తనాలు, ఎరువుల వాడకంలో అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ సూచించింది.

# సబ్ రిజిస్ట్రార్ రేగళ్ల రాముకు నీరుకుల్లా సర్పంచ్ ఘన సన్మానం



సుల్తానాబాద్,జూలై 29 (జనంసాక్షి) : ఇటీవల బదిలీపై సుల్తానాబాద్ సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించిన రేగళ్ల రామును బుధవారం నీరుకుల్ల గ్రామ సర్పంచ్ దళితరత్న అవార్డు గ్రహీత, మాదిగ హక్కుల దండోరా నియోజక వర్గ ఇన్చార్జ్ కాంపల్లి సతీష్ మర్యాదపూర్వకంగా కలిసి శు భాకాంక్షలు తెలిపి ఘనంగా శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా సర్పంచ్ కాంపల్లి సతీష్ మాట్లాడుతూ, ప్రజలకు నిష్పాక్షికంగా, పారదర్శకంగా, వేగవంతమైన సేవలు అందించడంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. నూతన బాధ్యతలు చేపట్టిన రేగళ్ల రాము తన అనుభవం, సేవా దృక్పథంతో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని నీరుకుల్ల సర్పంచ్ కాంపల్లి సతీష్ తన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

# చిల్డ్రన్స్ హోమ్ నుంచి ఇద్దరు బాలికలు పరార్..

## ఘటనాస్థలిని పరిశీలించిన డీసీపీ రామ్‌రెడ్డి






సుల్తానాబాద్,జూలై 29(జనంసాక్షి) : పట్టణంలోని మార్కండేయ కాలనీలో శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చిల్డ్రన్స్ హోమ్ నుంచి ఇద్దరు బాలికలు, అర్ధరాత్రి అదృశ్యమైన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనను డీసీపీ బి. రామ్‌రెడ్డి బుధవారం స్వయంగా పరిశీలించారు. చిల్డ్రన్స్ హోమ్‌ను సందర్శించిన ఆయన, సంఘటన జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి, పోలీసు అధికారులు,శిశు సంక్షేమ శాఖ అధికారులతో వివరాలు తెలుసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. 16 ఏళ్ల, 8 ఏళ్ల ఇద్దరు బాలికలు మంగళవారం అర్ధరాత్రి సమయంలో హోమ్ ప్రహరీ గోడ దూకి బయటకు వెళ్లిపోయారు. బాలికలు కనిపించకపోవడంతో చిల్డ్రన్స్ హోమ్ సూపరింటెండెంట్ వనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు సుల్తానాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.బాలికల ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టడంతో పాటు పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు. అవసరమైన సమాచారాన్ని జిల్లాలోని ఇతర పోలీసు యూనిట్లకూ చేరవేసి గాలింపును వేగవంతం చేశారు.ఈ సందర్భంగా డీసీపీ రామ్‌రెడ్డి చిల్డ్రన్స్ హోమ్‌లో భద్రతా ఏర్పాట్లపై ఆరా తీశారు. బాలికల ఆచూకీని వీలైనంత త్వరగా గుర్తించి క్షేమంగా తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా భద్రతను మరింత బలోపేతం చేయాలని సూచించారు.డీసీపీ వెంట ఏసీపీ గజ్జి కృష్ణ, సుల్తానాబాద్ సీఐ పొన్నమనేని రంజిత్‌రావు, ఎస్ఐ పెట్టెం చంద్రకుమార్, పోలీసు సిబ్బంది, శిశు సంక్షేమ శాఖ అధికారులు, చిల్డ్రన్స్ హోమ్ సిబ్బంది పాల్గొన్నారు.బాలికల ఆచూకీ తెలిసిన ప్రజలు వెంటనే సమీప పోలీసు స్టేషన్‌కు లేదా సుల్తానాబాద్ పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతో బాలికలను త్వరగా గుర్తించి వారి కుటుంబ సభ్యులు,సంబంధిత అధికారులకు అప్పగించే దిశగా చర్యలు కొనసాగుతున్నట్లు, పోలీసులు వెల్లడించారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో బాకం సాయికిరణ్ మరో ముందడుగు

## - ప్రజల విజ్ఞప్తికి వెంటనే స్పందించిన 6వ వార్డు కౌన్సిలర్ బాకం



సుల్తానాబాద్,జూలై 29(జనంసాక్షి) : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో, ఆరవ వార్డులో ప్రమాదకరంగా, రోడ్డుకు అడ్డంగా పడి ఉన్న చెట్లను వెంటనే తొలగించాలని,ఆరవ వార్డు ప్రజలు,కౌన్సిలర్ భాకంసాయికిరణ్ దృష్టికి తీసుకువెళ్లగా, వెనువెంటనే స్పందించిన, వార్డు కౌన్సిలర్ బాకం సాయికిరణ్ ప్రమాదకరంగా ఉన్న చెట్లను, తన సొంత డబ్బులు వెచ్చించి తొలగించడం జరిగింది. ప్రజల భద్రత దృష్ట్యా,6వ వార్డు కౌన్సిలర్ బాకం సాయికిరణ్ కు, ఆరవవార్డు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

# బ్యాంకు ముందు నీరు నిల్వ..ఖాతాదారులకు అవస్థలు




గోదావరిఖని, జనంసాక్షి: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గోదావరిఖని విద్యానగర్‌లో ఉన్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకు ముందు వర్షం నీరు ఎటు వెళ్ళక నిలిచి ఉండడం వల్ల ఖాతా దారులు తమ అవసరాల కోసం బ్యాంకులోకి వెళ్ళేందుకు అనేక అవస్థలు పడుతున్నారని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు తొడుపునూరి రమేశ్‌కుమార్ పేర్కొన్నారు.ఆయన రిటైర్డ్ ఎంప్లాయిస్‌తో కలిసి బ్యాంకు ముందు నిలిచి ఉన్న నీటిని పరిశీలించారు.అనంతరం మాట్లాడుతూ నీరు నిల్వ వల్ల బ్యాంకుకు వచ్చే వారు ముఖ్యంగా వృద్ధులు, మహిళలు జారి పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు వెంటనే స్పందించి బ్యాంకు ముందు నిలిచి ఉన్న నీరు బయటకు వెళ్ళేందుకు చర్యలు తీసుకోవాలని సిపిఐ నగర సమితి డిమాండ్ చేస్తుందని ఆయన తెలిపారు.సంబంధిత బ్యాంకు అధికారులు, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు కలిసి నిల్వ నీటిని తొలగించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంప్లాయిస్ లక్ష్మీపతి, సుదర్శన్, బూడిద మల్లేష్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఆసాల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

**తక్షణమే నిల్వ నీటిని తొలగించాలని ఖాతాదారుల డిమాండ్**

# ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను వెంటనే ప్రారంభించాలి

## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం టియుఎఫ్ ఎల్లారెడ్డిపేట మండల కమిటీ అధ్యక్షులు పొందుర్తి ఉమేష్



ఎల్లారెడ్డిపేట, జూలై 29, (జనంసాక్షి) : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం టియుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చీమ శ్రీనివాస్, కళా తపస్వి యెల్ల ఫోశెట్టి రాష్ట్ర కన్వీనర్ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆదేశాల మేరకు కాలయాపన చేయకుండా తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని, ఇచ్చిన హామీలను అమలు ప్రారంభించాలని, ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే ప్రారంభించాలని ఎల్లారెడ్డిపేట మండల కమిటీ అధ్యక్షులు పొందుర్తి ఉమేష్ అన్నారు. ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని, ఇచ్చిన హామీలన్ని అమలు చేయాలని, ఉద్యమకారుల సంక్షేమానికి ప్రత్యేకమైన బడ్జెట్ కేటాయించాలని, సంక్షేమ పథకంలో 10శాతం కోట కల్పించాలని, ఉద్యమాకారులకు ఇంటి స్థలాలు కేటాయించాలని, పెన్షన్, ఉచిత బస్సు పాస్, హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. ఉద్యమకార్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, తెలంగాణ సాంస్కృతిక సారధిలో ఉద్యోగాలు ఏర్పాటు కల్పించాలని, ఉద్యమకారుల ఆత్మగౌరం కోసం మా ఉద్యమం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రామిండ్ల దేవదానం, ఉపాధ్యక్షులు మట్లా అశోక్, కార్యవర్గ సభ్యులు తాటిపెల్లి నర్సయ్య, మహేష్, స్వామి, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

# వర్షాకాలంలో విద్యుత్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

## సూపరింటెండెంట్ ఇంజనీర్ టి. వేణుమాదవ్



ఎల్లారెడ్డిపేట, జూలై 29, (జనంసాక్షి) : వర్షాకాలంలో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులు, భారీ వర్షాల కారణంగా విద్యుత్ ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని టిజిఎస్‌పిడిసిఎల్ రాజన్నసిరిసిల్ల జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ టి. వేణుమాదవ్ తెలిపారు. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారి తీయవచ్చని హెచ్చరిస్తూ, ప్రజలు విద్యుత్ భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. గృహ వినియోగదారులు, రైతులు, పశు వుల కాపరులు, విద్యార్థులు సహ ప్రతి ఒక్కరూ విద్యుత్‌పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. వర్షం కురుస్తున్న సమయంలో తడిసిన విద్యుత్ స్తంభాలు, స్టే వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, తడి గోడలకు అనుకొని ఉన్నత విద్యుత్ పరికరాలను తాకరాదన్నారు. తెగిపోయిన లేదా వేలాడుతున్న విద్యుత్ తీగలకు ఎట్టి పరిస్థితుల్లోను దగ్గరగా వెళ్లకూడదని స్పష్టం చేశారు. తడి చేతులతో స్విచ్‌లు, ప్లగ్‌లు, మీటర్ బోర్డులు, మోటర్లు, గీజర్లు, కూలర్లు వంటి విద్యుత్ పరికరాలను తాకరాదని, సెల్‌ఫోన్ చార్జింగ్‌లో ఉండగా మాట్లాడకూడదని సూచించారు. ఇంటి వైరింగ్‌కు నాణ్యమైన ఎర్తింగ్ చేయించుకోవాలని, ఐఎస్ఐ ప్రమాణాలు కలిగిన వైర్లు, ప్లగ్గులు, ఛార్జర్లు మాత్రమే ఉపయోగించాలని తెలిపారు. బట్టలు ఆరబెట్టేప్పుడు ఇనుప దండెలకు బదులుగా ప్లాస్టిక్ దండెలు ఉపయోగించాలని, విద్యుత్ లైన్లు, మీటర్ బోర్డుల సమీపంలో తడి బట్టలు ఆరబెట్టవద్దని తెలిపారు. రైతులకు ప్రత్యేకంగా పలు సూచనలు చేశారు. వ్యవసాయ మోటార్‌ను ఆన్ చేసే ముందు స్టార్టర్, వైర్లు, స్విచ్‌లు సురక్షితంగా ఉన్నాయో లేదా పరిశీలించాలని, మోటర్లు, స్టార్టర్లు, జిఐ పైపులు, పంపుసెట్లకు సరైన ఎర్తింగ్ చేయించాలని సూచించారు. ట్రాన్స్‌పార్మర్ల వద్ద ప్యూజులు మార్చడం, ఏబీ స్విచ్‌లు ఆపరేట్ చేయడం, కాలిన తీగలు సరిచేయడం వంటి పనులు స్వయంగా చేయరాదన్నారు. విద్యుత్ లైన్ క్రింద ఇనుప పైపులు ఎత్తేటప్పుడు అత్యంత జాగ్రత్త పాటించాలని హెచ్చరించారు. వ్యవసాయ భూముల్లో ఎలక్ట్రిక్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం చట్టవిరుద్ధమని, చేపల వేట లేదా వన్యప్రాణాల వేటకు విద్యుత్ ప్రవాహాన్ని ఉపయోగించడం తీవ్రమైన నేరమని స్పష్టం చేశారు. పిల్లలను విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌పార్మర్లు, మీటర్ బోరుల వద్ద ఆడనివ్వకూడదని, పశువులను విద్యుత్ స్తంభాలు లేదా ట్రాన్స్‌పార్మర్లకు కట్టరాదని తెలిపారు. విద్యుత్‌షాక్ సంభవించినప్పుడు బాధితుడిని నేరుగా చేతులతో తాకకూడదని, కర్ర లేదా ప్లాస్టిక్ వంటి విద్యుత్ ప్రసారం చేయని వస్తువులతో వేరే చేసి వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేసి వైద్య సహాయం అందించాలని సూచించారు. కొత్త భవనాల నిర్మాణంలో విద్యుత్ లైన్లకు కనీసం 1.2 మీటర్ల భద్రత దూరం పాటించాలని, అనుమతి లేకుండా విద్యుత్ లైన్లపై కొండీలు వేసి విద్యుత్ చౌర్యానికి పాల్పడటం చట్టరీత్యా నేరమని తెలిపారు. తెగిపోయిన విద్యుత్ తీగలు లేదా విద్యుత్ పరికరాల్లో లోపాలు గమనించిన వెంటనే టీజీఎస్‌పిడిసిఎల్ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. నాసిరకం, వైరింగ్, నాణ్యతలేని పరికరాలు, ఎర్తింగ్ లేకపోవడం, అనధికారిక మరమ్మతులు, నిర్లక్ష్యమే ఎక్కువ ప్రమాదాలకు కారణమని తెలిపారు. విద్యుత్ అప్రమత్తంగా ఉండండి, సురక్షితంగా జీవించండి, సురక్షితంగా వ్యవసాయం చేయండి అని పిలుపునిచ్చిన సూపరింటెండెంట్ ఇంజనీర్ టి. వేణుమాదవ్, ఏదైన విద్యుత్ ప్రమాదం లేదా లోపం గమనించిన వెంటనే టిజిఎస్‌పిడిసిఎల్ టోల్ ఫ్రీ నెంబర్ 1912కు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

# ఆధునిక సాంకేతికతపై పట్టుసాధించాలి

- వాటిని రోజువారీ విధుల్లో విరివిగా వినియోగించాలి
- రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలి
- రామడుగు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన సీపీ గౌష్ ఆలం ఐపీఎస్

**రామడుగు(జనంసాక్షి):**

రామడుగు పోలీసు స్టేషన్‌ను బుధవారం కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆకస్మికంగా తనిఖీ చేశారు.పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు.అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో పలు కేసుల్లో పట్టుబడి స్వాధీనంలో ఉన్న వాహనాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లో ఉన్న సిబ్బందితో మాట్లాడి, వారికి కేటాయించిన విధుల గురించి అడిగారు. సరైన పద్ధతిలో రికార్డుల నిర్వహణ, నమోదైన కేసుల వివరాలు సిసిటిఎన్ఎస్‌లో పొందుపరచాలని ఆదేశించారు.తెలంగాణ పోలీసులు టెక్నాలజీ వినియోగంలో భాగంగా అందుబాటులోకి తెచ్చిన సీసీటీఎన్ఎస్ – 2.0,పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో ఈ-సమన్ల జారీ అమలు. టీఎస్-కాప్ ,హెచ్ఆర్ఎంఎస్, ఈ- సాక్ష్య, టెక్ డాటం, ఐరాడ్ దర్పణ్, సీఈఐఆర్,సైబర్ క్రైమ్ ఆర్థిక/ఆర్థికేతర నేరాల సాఫ్ట్‌వేర్, సీడీఆర్ వంటి అన్ని రకాల అప్లికేషన్లపై పూర్తి స్థాయిలో పట్టు సాధించి, వాటిని రోజువారీ విధుల్లో విరివిగా వినియోగించాలని



సూచించారు. స్టేషన్‌కు కేటాయించిన వస్తువులను పరిశీలించడంతో పాటు, బ్లూ కోల్ట్స్ సిబ్బంది పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్‌ను ఉపయోగిస్తున్న తీరును తనిఖీ చేశారు.ఎఫ్ ఐ ఆర్ ఇండెక్స్‌ను పరిశీలించి, పెండింగ్ కేసులపై సమీక్ష జరిపారు. కేసుల పెండింగ్‌కు గల కారణాలను అడిగి తెలుసుకుని, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. నమోదైన సైబర్ నేరాల గురించి వివరాలు తెలుసుకుంటూ, విసిబుల్ పోలిసింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రామడుగు పోలీసు స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలను సెక్టార్లుగా, సబ్ సెక్టార్లుగా విభజించి, వాటికి గ్రామ పోలీసు అధికారులను కేటాయించాలని స్పష్టం చేశారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలని, ప్రతి నెల వారికి సంబంధించిన నూతన సమాచారాన్ని నమోదు చేయాలని ఆదేశించారు.కార్యక్రమంలో రూరల్ ఏసీపీ విజయకుమార్, చొప్పదండి సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రదీప్ కుమార్, రామడుగు ఎస్సై రాజులతో పాటు ఇతర అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.






# పెద్దపల్లి జిల్లా యువత ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి -కలెక్టర్

**పెద్దపల్లి,జూలై 29 (జనంసాక్షి) :**

పెద్దపల్లి జిల్లా నిరుద్యోగ యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో జూలై 30, 2026న పెద్దపల్లి టాస్క్ రీజనల్ సెంటర్ (ఆర్ టి సి బస్ స్టాండ్ సమీపంలో, బస్ డిపో ప్రాంగణం)లో ప్రత్యేక నియామక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సమీపంలోని ప్రముఖ ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీలో ఉద్యోగాల కోసం 10వ తరగతి, ఇంటర్మీడియట్, డిప్లొమా మరియు డిగ్రీ అర్హత కలిగిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ 18,000 నుండి రూ 21,000 వరకు వేతనంతో పాటు పి ఎఫ్, (ఇ ఎస్ ఐ) ఉచిత భోజనం మరియు రవాణా సౌకర్యాలు కల్పించబడతాయని పేర్కొన్నారు.అదే రోజు బీఎస్సీ కెమిస్ట్రీ మరియు బీఎస్సీ బయోటెక్నాలజీ పూర్తి చేసిన అభ్యర్థుల కోసం మూడు నెలల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ప్రోగ్రామ్కు నమోదు మరియు ఎంపిక ప్రక్రియ కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందించి, అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు వివరించారు.జిల్లాలోని అర్హులైన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హతల ధృవపత్రాలు, ఆధార్ కార్డు మరియు ఇతర అవసరమైన పత్రాలతో జూలై 30, 2026న ఉదయం 10.00 గంటలకు పెద్దపల్లిలోని టాస్క్ రీజనల్ సెంటర్ (ఆర్ టి సి బస్ స్టాండ్ సమీపంలో, బస్ డిపో ప్రాంగణం) వద్ద జరిగే ఇంటర్వ్యూలు మరియు నమోదు ప్రక్రియకు హాజరుకావాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

# రంగంపల్లి రాజీవ్ రహదారి వద్ద వరద ఉధృతి పరిశీలించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**పెద్దపల్లి,జూలై 29(జనంసాక్షి) :**

పెద్దపల్లి పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రానున్న రెండు రోజులు వర్షాలు ఉండడం వల్ల శిదిలావస్థలో ఉన్న ఇండ్లలలో నివసించవద్దని సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అన్నారు. మున్సిపల్ సిబ్బందితో అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ ని ఆదేశించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య ,మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ ,స్థానిక కౌన్సిలర్లు పూదరి మహేందర్, తోట ఫణిందర్ భూపతి, అక్కపల్లి క్రాంతి సుజాత, నదీమ్,తూముల లత సుభాష్,మొలుగురి కమల్, టౌన్ ప్లానింగ్ అధికారులు నరేష్,వినయ్ జూనియర్ అసిస్టెంట్ రమాకాంత్,వార్డ్ ఆఫీసర్లు,సానిటరీ ఇన్స్పెక్టర్ రామ్మోహన్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ప్రమాద కరంగా మారిన భోజన్నపేట రోడ్డమ్

**పెద్దపల్లి,జూలై 29(జనంసాక్షి) :**

పెద్దపల్లి జిల్లాలో రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తమైంది.పెద్దపల్లి మండలం భోజన్నపేట రోడ్డమ్‌పై కాల్వ వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వాహనదారులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.భారీ వర్షాల కారణంగా రోడ్డమ్‌పై ఉన్న కాల్వ పొంగిపొర్లి, వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో ద్విచక్ర వాహనాలు,కార్లు అత్యంత జాగ్రత్తగా రాకపోకలు సాగిస్తున్నాయి. మరికొందరు నీటి ఉధృతి తగ్గే వరకు అక్కడే వేచి చూస్తున్నారు.ఇదిలా ఉండగా, కూనారం రైల్వే గేట్ మరమ్మత్తుల కారణంగా భోజన్నపేట మార్గంలో వాహనాల రాకపోకలు పెరిగాయి.ఈ పరిస్థితుల్లో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ప్రమాదం సంభవించే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అధికారులు వెంటనే స్పందించి రోడ్డమ్ వద్ద రాకపోకలను తాత్కాలికంగా నియంత్రించడం, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, అవసరమైతే ప్రత్యామ్నాయ మార్గాలను సూచించడం ద్వారా ప్రమాదాలను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.



# సన్న బియ్యం అర్హులకే అందేలా కట్టుదిట్టమైన పర్యవేక్షణ

- అదనపు రెవెన్యూ కలెక్టర్ శ్రీరాములు
- బ్లాక్ మార్కెటింగ్, రీసైక్లింగ్‌కు తావివ్వొద్దు

**పెద్దపల్లి,జూలై 29(జనంసాక్షి) :**

జిల్లాలో ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేస్తున్న సన్న బియ్యం అర్హులైన బీపీఎల్ కుటుంబాలు, విద్యా సంస్థలకు మాత్రమే చేరేలా కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేపట్టాలని అదనపు రెవెన్యూ కలెక్టర్ బి. శ్రీరాములు అధికారులను ఆదేశించారు.బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో పౌర సరఫరాల శాఖ అధికారులతో నిర్వహించిన జిల్లా స్థాయి విజిలెన్స్ సమావేశంలో అదనపు కలెక్టర్ పాల్గొని సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్రీరాములు మాట్లాడుతూ ప్రభుత్వం 2025 ఏప్రిల్ 1 నుంచి అన్ని చౌక ధరల దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేపట్టిందని తెలిపారు. ఆహార భద్రతా కార్డులోని ప్రతి వ్యక్తికి నెలకు 6 కిలోల సన్న బియ్యం, అంత్యోదయ కార్డుకు 35 కిలోలు, అన్నపూర్ణ కార్డుకు 10 కిలోల బియ్యం ఉచితంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని 14 మండలాల పరిధిలో 410 చౌక ధరల దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ జరుగుతోందని తెలిపారు. బియ్యం పంపిణీలో ఎలాంటి అక్రమాలు, బ్లాక్ మార్కెటింగ్, రీసైక్లింగ్ జరగకుండా నిరంతర తనిఖీలు నిర్వహించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో మొత్తం 2,46,981 రేషన్ కార్డుల ద్వారా 7,17,898 మంది లబ్ధిదారులు ప్రయోజనం పొందుతున్నారని, కొత్తగా 30,909 రేషన్ కార్డులు మంజూరు చేసి 88,357 మంది లబ్ధిదారులను చేర్చినట్లు తెలిపారు. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ మూడు నెలల కోటా కింద జిల్లాకు 13,645.968 మెట్రిక్ టన్నుల బియ్యం కేటాయించినట్లు వెల్లడించారు.జిల్లాలో ప్రస్తుతం 43 ఫెయిర్ ప్రైస్ షాపుల డీలర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటి భర్తీకి అవసరమైన చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.ప్రతి రేషన్ కార్డుదారుడి(ఇ కే వై సి)ప్రక్రియను జూలై 31లోపు శాతం 100 పూర్తి చేయాలని ఆదేశించారు.జిల్లాలో మొత్తం 7,16,498 మంది లబ్ధిదారుల్లో 5,89,738 మంది (82.31 శాతం) ఇప్పటికే (ఇ కే వై సి)పూర్తి చేసుకున్నారని, మిగిలిన వారందరూ నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లాలో గుర్తించిన 7,490 మంది అనుమానిత లబ్ధిదారుల్లో 4,894 మంది ధృవీకరణ పూర్తయిందని, మిగిలిన వారి ధృవీకరణను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.ఈ ఏడాది



జనవరి నుంచి ఇప్పటివరకు జిల్లాలో నమోదైన 62 కేసులపై సమీక్ష నిర్వహించిన అదనపు కలెక్టర్, ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించిన 31 కేసుల్లో 579.80 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకుని రూ. 25.89 లక్షల విలువైన నిల్వలను సీజ్ చేసినట్లు, ఎల్పీజీకి సంబంధించిన 31 కేసుల్లో 45 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.మహాలక్ష్మి పథకం కింద జిల్లాలో 1,18,953 అర్హ కుటుంబాలకు ఇప్పటివరకు 4,73,691 గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసి, రూ. 1,403.45 లక్షల సబ్సిడీ అందించినట్లు అధికారులు వివరించారు.ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, జడ్పీ సీఈఓ నరేందర్, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి రవీందర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# భారీ వర్షాలపై పోలీసుల అప్రమత్తత..

## - వరద ప్రభావిత ప్రాంతాల్లో పోలీస్ కమిషనర్ క్షేత్రస్థాయి పరిశీలన..

**గోదావరిఖని, జనంసాక్షి:**
రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ గోదావరిఖని టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఆర్ఎఫ్‌సీఎల్ ప్రాంతంలోని వరద నీరు డ్రైనేజీ కాలువల ద్వారా వీర్లపల్లి గ్రామంలోకి చేరడంతో ఆ ప్రాంతాన్ని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ పరిశీలనలో గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, గోదావరిఖని టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌రావు,గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన కమిషనర్,భారీ వర్షాల కారణంగా వరద ప్రవాహం అధికంగా ఉన్నందున ప్రజలతో పాటు పోలీసు అధికారులు,సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇండ్లలోకి వరద నీరు చేరే ప్రమాదం ఉన్నట్లయితే వెంటనే బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రజల రక్షణ కోసం పోలీసులు 24ఐ7 అప్రమత్తంగా ఉండి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు. భారీ వర్షాల కారణంగా వాగులు, వంకలు,చెరువులు, నదుల్లో వరద ప్రవాహం ఉధృతంగా ఉన్నందున వాటి వద్దకు ఎవరూ వెళ్లరాదని సూచించారు.గోదావరి,మానేరు నదుల పరివాహక ప్రాంతాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని,చెరువులు,వాగులు,ప్రాజెక్టుల వద్దకు ప్రజలు, మత్స్యకారులు ఎట్టి పరిస్థితుల్లోనూ చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు.వర్షపు నీటి కారణంగా రహదారులపై వాహనాలు అదుపు తప్పే ప్రమాదం ఉన్నందున వాహనదారులు పరిమిత వేగంతో, అత్యంత జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు.పిల్లలు,యువకులు చెరువులు,నదుల వద్దకు సెల్ఫీలు దిగడానికి లేదా ఈత కొట్టడానికి వెళ్లకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు.విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు సేవలందించేందుకు జిల్లా పోలీసు అధికారులు,సిబ్బంది ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నారని తెలిపారు.ఎలాంటి అత్యవసర సహాయం అవసరమైనా వెంటనే డయల్-100కు కాల్ చేయాలని లేదా సమీపంలోని స్థానిక పోలీసు అధికారులను సంప్రదించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు.

**వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..**

**- పెద్దపల్లి డీసీపీ బి.రామ్‌రెడ్డి..**

రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ వర్షాలతో నాలాల ప్రవహించే నీరు రోడ్డుపై రావడంతో ఆ ప్రాంతాలను పెద్దపల్లి డిసిపి బి. రామ్‌రెడ్డి, మున్సిపల్ కమీషనర్,మేయర్ మహంకాళి స్వామి,గోదావరిఖని ఏసిపి ఎం.రమేష్ గోదావరిఖని వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి మల్కాపూర్,మెడికల్ కళాశాల,5 ఇంక్లయిన్,

# భారీ వర్షాలతో జీడీకే-2ఏ మోరి వద్ద రాకపోకలకు అంతరాయం..

- ◆ గంగానగర్, జీడీకే-5 ఇంక్లయిన్ మోరి మార్గాలను వినియోగించాలి..
- ◆ ఉద్యోగుల భద్రతే సంస్థకు అత్యంత ప్రాధాన్యం..
- ◆ రామగుండం ఏరియా-1 జీఎం డి. లలిత్ కుమార్..



**గోదావరిఖని, జనంసాక్షి:**
ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో రామగుండం ఏరియా-1 పరిధిలోని జీడీకే-2ఏ మోరి వద్ద వర్షపు నీరు ఉధృతంగా ప్రవహిస్తూ రహదారిపైకి చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పరిస్థితి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని రామగుండం ఏరియా-1 జనరల్ మేనేజర్ డి. లలిత్ కుమార్ అధికారుల బృందంతో కలిసి బుధవారం జీడీకే-2ఏ మోరిని సందర్శించి పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ సందర్భంగా నీటి ప్రవాహాన్ని పరిశీలించిన జీఎం సంబంధిత అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు.ఉద్యోగులు, కార్మికులు, స్థానిక ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. నీటి ప్రవాహం అధికంగా ఉన్న జీడీకే-2ఏ మోరి మార్గంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయాణించవద్దని సూచించారు. ప్రత్యామ్నాయంగా గంగానగర్ లేదా జీడీకే-5 ఇంక్లైన్ మోరి మీదుగా ఉన్న మార్గాలను మాత్రమే వినియోగించాలని కోరారు.వాతావరణ శాఖ మరో రెండు రోజుల పాటు భారీ నుంచి మోస్తరు వర్షాలు కొనసాగే అవకాశం ఉందని హెచ్చరించిన నేపథ్యంలో ఉద్యోగులు మరింత అప్రమత్తంగా ఉండాలని జీఎం సూచించారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని, విధులకు హాజరయ్యే సమయంలో అధికారులు జారీ చేసే సూచనలు, భద్రతా నిబంధనలను తప్పనిసరిగా అమలు చేయాలని పేర్కొన్నారు.ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల సంక్షేమం, భద్రతే సంస్థకు అత్యంత ముఖ్యమని పేర్కొన్న డి.లలిత్‌కుమార్, వర్షాల కారణంగా ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. సివిల్, సెక్యూరిటీ విభాగాలు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన అన్ని రక్షణ చర్యలు చేపడుతున్నాయని తెలిపారు. జీఎం పర్యటనలో ఎస్‌వోటూ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్, డీజీఎం (సివిల్) కేడీయన్ వరప్రసాద్, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.భారీ వర్షాల నేపథ్యంలో ఉద్యోగులు, స్థానిక ప్రజలు అప్రమత్తంగా ఉండి అధికారుల సూచనలను పాటించాలని సింగరేణి యాజమాన్యం విజ్ఞప్తి చేసింది.

# వరద సహాయక చర్యలకు కంట్రోల్ రూం ఏర్పాటు..

**గోదావరిఖని, జనంసాక్షి:**
వరద సహాయక చర్యలు కొరకు రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి, కమీషనర్. జె.అరుణశ్రీ తెలిపారు.ఫోన్ నెం.9603666444, 1800 4257062 (టోల్‌ఫ్రీ), 9392483959లకు సమాచారం అందిస్తే తక్షణం స్పందించి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కంట్రోల్ రూమ్ భారీ వర్షాలు తగ్గుముఖం పట్టేవరకు నిరంతరాయంగా పని చేస్తుందని అన్నారు.

**నెం.9603666444, 1800 4257062 (టోల్‌ఫ్రీ), 9392483959**

# సింగరేణి అనుబంధ సంస్థ ఆప్మెల్‌లో 'సోలార్' వెలుగు..

**- సౌర విద్యుత్ ప్లాంట్‌ను వర్చువల్‌గా ప్రారంభించిన సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి..**

**- సోలార్‌తో ఏటా రూ.24 లక్షల విద్యుత్ ఖర్చు ఆదా..**

**- ఈ ఏడాది రికార్డు స్థాయిలో రూ.23.33 కోట్ల నికర లాభం..**

**- స్వర్ణోత్సవ సంవత్సరంలో బహుముఖ వ్యాపార విస్తరణకు పిలుపు..**

**గోదావరిఖని, జనంసాక్షి:**
విజయవాడలో ఉన్న సింగరేణి అనుబంధ సంస్థ అయిన ఆప్మెల్ (ఆంధ్రప్రదేశ్ హెవీ మిషనరీ అండ్ ఇంజినీరింగ్ లిమిటెడ్) స్వర్ణోత్సవాల సందర్భంగా ప్లాంట్ లో ఏర్పాటు చేసిన 300 కిలోవాట్ల సోలార్ ప్లాంట్ ను సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి బుధవారం హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి వర్చువల్ గా ప్రారంభించారు. అలాగే మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ప్లాంటులో కొత్తగా నిర్మించిన సీసీ రోడ్లు, ఆర్ సి రోడ్లను కూడా ఆయన ప్రారంభించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి,ఇంధన శాఖామాత్యులు భట్టి విక్రమార్క మార్గనిర్దేశంలో సింగరేణితోపాటు అనుబంధ సంస్థ అయిన ఆప్మెల్‌ను బహుముఖంగా విస్తరించే ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు.50 ఏళ్ల ఆప్మెల్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రూ.63.13 కోట్ల టర్నోవర్, రికార్డు స్థాయిలో రూ.23.33 కోట్ల నికర లాభాలను ఆర్జించడంపై ఉద్యోగులకు అభినందనలు తెలిపారు.గత ఏడాది రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆప్మెల్‌ను సందర్శించిన సమయంలో ఇచ్చిన దిశానిర్దేశం, స్ఫూర్తితో సాధించిన విజయంగా అభివర్ణించారు. అలాగే ప్లాంట్‌ను సందర్శించిన సమయంలో ప్లాంట్ లో సౌకర్యాల మెరుగుదలకు హామీ ఇచ్చారని ,ఆయన ఆదేశాల పైన ప్లాంట్ ఆవరణలో సిసి, ఆర్సిసి రోడ్లు నిర్మించడం జరిగిందన్నారు.సెప్టెంబరు 1,1976లో ప్రారంభమైన ఆప్మెల్ సంస్థ ఈ ఏడాది స్వర్ణోత్సవ సంవత్సరంలోకి అడుగుపెట్టిన నేపథ్యంలో ప్రస్తుతం ప్లాంటులో తయారు చేస్తున్న యంత్ర పరికరాలు, విడిభాగాలతో పాటు రానున్న రోజుల్లో వివిధ పరిశ్రమల ఆధునిక అవసరాలను పరిగణనలోనికి తీసుకొని వ్యాపార విస్తరణ చర్యలు చేపట్టాలన్నారు.ఆప్మెల్ అభివృద్ధికి, ముఖ్యంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చుకోవడానికి, తద్వారా మరింత ఉన్నత స్థాయికి ఎదగడానికి సింగరేణి సంస్థ ఎప్పుడు సహకరిస్తూనే ఉంటుందన్నారు.

**సోలార్ ప్లాంట్ ఏర్పాటుతో విద్యుత్ ఖర్చులలో భారీ ఆదా:**
ఆప్మెల్ ప్లాంటు విద్యుత్ మరియు కాలనీ అవసరాలు కలిపి ప్రతీ ఏడాది 60 లక్షల రూపాయలు విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నారు. ప్రస్తుతం రూ.1.24 కోట్లతో ఏర్పాటు చేసిన ఈ సోలార్ ప్లాంట్ తో ఏడాదికి 24 లక్షల రూపాయలు ఆదా అవుతుంది. ఐదేళ్లలో పెట్టుబడి మొత్తాన్ని రాబట్టుకోవచ్చు. అలాగే పర్యావరణ హిత చర్యలకు ప్రోత్సాహం అందించినట్లు అవుతుంది.ఆప్మెల్ ఛైర్మన్ ఎన్‌వికె శ్రీనివాస్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో సంస్థ అభివృద్ధికి చేపట్టబోయే ప్రణాళికలను వివరించారు.

# సింగరేణి బంగ్లాస్ ఏరియా శ్రీదుర్గామాత ఆలయంలో..

## - వైభవంగా గురుపౌర్ణమి..శాకంబరి ఉత్సవాలు..



**గోదావరిఖని, జనంసాక్షి:**
రామగుండం ఏరియా-1 సింగరేణి బంగ్లాస్ ఏరియా ప్రాంగణంలో వెలసిన శ్రీదుర్గామాత ఆలయంలో ఆషాఢ మాస గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని శాకంబరి ఉత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయాన్ని వివిధ రకాల పూలు, పండ్లు, ఫలాలు, ఆకుకూరలు, కూరగాయలు, పుష్పాలతో శాకంబరి దేవి స్వరూపంగా సుందరంగా అలంకరించి భక్తులను విశేషంగా ఆకట్టుకున్నారు. హిందూ సంప్రదాయంలో ఆషాఢ మాసం అత్యంత పవిత్రమైన మాసంగా భావిస్తారు.ఈ మాసంలో వచ్చే గురుపౌర్ణమి రోజున గురువులను, ఋషులను స్మరించుకోవడం ఆనవాయితీ. శాకంబరిదేవి ప్రకృతి, పంటలు, పచ్చదనం, అన్నపూర్ణ తత్వానికి ప్రతీకగా భావించబడుతుంది. అందువల్ల అమ్మవారిని కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తే సమృద్ధిగా వర్షాలు కురిసి, పంటలు బాగా పండడంతో పాటు ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆరోగ్యం, ఐశ్వర్యం చేకూరుతాయని భక్తుల విశ్వాసం.ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి విశేష పూజలు, అర్చనలు, ఒడిబియ్యం సమర్పించి రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, సింగరేణి సంస్థ మరింత అభివృద్ధి చెందాలని, సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికులు, వారి కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని, దేశ ప్రజలందరూ శాంతి, సుభిక్షాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు.ప్రతి సంవత్సరం నిర్వహించే శాకంబరి ఉత్సవాలు భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు ప్రకృతి పరిరక్షణ,పర్యావరణ పరిరక్షణ, అన్నదాతల సంక్షేమానికి ప్రతీకగా నిలుస్తాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం పంపిణీ చేశారు.ఈ పవిత్ర ఉత్సవాల్లో సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్స్)ఎల్.వి.సూర్యనారాయణ, మాలతి సూర్యనారాయణ, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) వెంకటేశ్వర్లు-విజయలక్ష్మి, సీఎంఓ కిరణ్ రాజ్‌కుమార్, నిర్మల-కిరణ్ రాజ్‌కుమార్, రామగుండం ఏరియా-1 జనరల్ మేనేజర్ లలిత్ కుమార్, ఆర్‌జీ-1 సేవా అధ్యక్షురాలు అనిత-లలిత్‌కుమార్,రెస్క్యూ విభాగానికి చెందిన జియం సతీమణి వాణి-శ్రీనివాస్ రెడ్డి, ఆర్‌జీ-2కు చెందిన వనజ-వెంకటయ్య, శ్రీరాంపూర్ జియం సతీమణి ఉమా-శ్రీనివాస్, ఆలయ కమిటీ కార్యదర్శి కె.డి.యన్. వరప్రసాద్-విజయ, ఆలయ కమిటీ సభ్యులు అంజలి, నీరజ, స్వరూప, సునీత, పద్మ, శ్రీదేవి,సింగరేణి బంగ్లాస్ ఏరియాలోని పలువురు ఉన్నతాధికారులు, వారి కుటుంబ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.